




# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States








సంపుటి : 23 | సంచిక : 319 | ది. 19-2-2025 | విజయవాడ | బుధవారం | పేజీలు : 8 | వెల : రూ.1/-


# రాష్ట్రానికి గ్రోత్ ఇంజన్‌గా ఆక్వా రంగం నిలవాలి

- టెక్నాలజీ వాడకంతో అద్భుత ఫలితాలు... 30 శాతం గ్రోత్ రేట్ సాధ్యమే
- ప్రకృతి సేద్యంతో ప్రపంచ వ్యాప్తంగా ఆక్వా ఉత్పత్తులకు డిమాండ్
- సీడ్, ఫీడ్‌లో జాగ్రత్తలు తీసుకోవాలి...యాంటీ బయాటిక్స్‌ను పూర్తిగా నియంత్రించాలి
- 10 లక్షల ఎకరాల్లో ఆక్వాసాగు లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం
- కాలుష్యం లేని ఆక్వాదిశగా ఉత్పత్తి దారులు, వ్యాపారులు పనిచేయాలి
- జిఎఫ్‌ఎస్‌టి నిర్వహించిన ఆక్వా టెక్ 2.0 కాన్‌క్లేవ్‌లో ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు





**అమరావతి,ఫిబ్రవరి 18 (వార్తాప్రభ) :** టెక్నాలజీ వాడకంతో అక్వారంగంలో అద్భుత ఫలితాలు సాధించవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిపుష్టికి ఆక్వారంగం గ్రోత్ ఇంజన్‌గా నిలుస్తుందని సీఎం అన్నారు. టెక్నాలజీ వాడకం, నూతన పద్ధతులతో ఈ రంగంలో నిలకడగా 30 గ్రోత్‌రేట్ సాధ్యమేనన్నారు. ఆక్వాలో ప్రకృతి సేద్యంతో ప్రపంచ వ్యాప్తంగా మన ఉత్పత్తులకు డిమాండ్ ఏర్పడుతుందని సీఎం వివరించారు. ప్రకృతి సేద్యం ద్వారా వ్యవసాయంలో మంచి ఫలితాలు వస్తున్నాయని.... ఆక్వాలో కూడా ఆ తరహా విధానాలు అమలు చేయాలన్నారు. ఆక్వా ఫీడ్ విషయంలో తగు మార్పులు చేయాలని సిఎం అన్నారు. మన ఉత్పత్తులకు వ్యాల్యూ యాడ్ చెయ్యడం ద్వారా రైతులు ఎక్కువ ఆదాయం పొందవచ్చని సీఎం చెప్పారు. ప్రస్తుతం 4 లక్షల ఎకరాల్లో ఆక్వాను సాగు చేస్తున్నారని...2029–30నాటికి 10 లక్షల ఎకరాలకు పెరగాలని సీఎం ఆకాంక్షించారు. అయితే కాలుష్య రహితంగా ఆక్వా ప్రయాణం సాగాలన్నారు. ఆక్వాలో ప్రధాన సమస్యగా ఉన్న కాలుష్యానికి పరిష్కార మార్గాలు ఉన్నాయని..వాటిని రైతులు, ఉత్పత్తి దారులు పాటించాలని కోరారు. ప్రతి ఒక్కరూ తమ సాగు వివరాలను రిజిస్టర్ చేసుకోవాలని....అలా కాకుండా ఇష్టానుసారంగా చేస్తానంటే మాత్రం నిబంధనల ప్రకారం వ్యవహరిస్తామని చెప్పారు. ఆక్వాకు ప్రాధాన్యం అనేది తమ అభిమతమన్న సీఎం...నిబంధనల అమలకు కూడా అంతే ప్రాధాన్యం ఇస్తామని...పొల్యూషన్ విషయంలో కఠినంగా ఉంటామని స్పష్టం చేశారు. మూడు రోజుల పాటు విజయవాడలోని హొటల్‌లో జరిగిన ఆక్వా టెక్ 2.0 కాన్ క్లేవ్ చివరి రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు. జిఎఫ్‌ఎస్‌టి ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో ఆక్వారంగంలో వస్తున్న మార్పులు, అవకాశాలు, సమస్యలు, పరిష్కారాలు, పాలసీలు, టెక్నాలజీ సహకారం వంటి అంశాలపై చర్చించారు. రైతులు, ప్రాసెసింగ్ ఫ్యాక్టరీల యజమానులు, ట్రేడర్లుతో పాటు నిపుణులు ఈ కాన్‌క్లేవ్‌లో పాల్గొన్నారు. రాష్ట్రానికి ఆక్వాను ప్రధాన ఆదాయ వనరుగా మార్చేందుకు ఉన్న అవకాశాలు, అధిగమించాల్సిన అవరోధాలపై ఈ సదస్సుల్లో చర్చించారు. రైతులను చైతన్య పరిచేలా...టెక్నాలజీ వాడకం పెంచేలా మూడు రోజుల పాటు పలు అంశాలపై ఇక్కడ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు.

**ఆక్వాసాగుకు రాష్ట్రం అనుకూలం..** 'ఆక్వా రంగంపై నాకు ప్రత్యేకమైన శ్రద్ధ ఉంది....మన రాష్ట్రం ఆక్వా సాగుకు అత్యంత అనుకూలం. 2014–19 మధ్య కాలంలో నాడు ఆక్వా రాష్ట్రానికి ప్రధాన ఆదాయ వనరుగా నిలిచింది. రాష్ట్ర జీవీఏ(స్థూల విలువ జోడింపు)లో 8.8 శాతం ఆక్వా వాటాగా ఉంది. వియత్నాం వంటి దేశాల్లో మన కంటే తక్కువ ప్రొడక్షన్ ఉన్నా...వాల్యుయేషన్ లో వాళ్లు ముందు ఉన్నారు. వియత్నాం ఆక్వా ఉత్పత్తుల్లో 3.9 మిలియన్ టన్నుల ఎగుమతులతో 13 బిలియన్ డాటర్లు ఆర్జిస్తుండగా, మనం 5 మిలియన్ మెట్రిక్ టన్నులు ఎగుమతి చేస్తూ 3 బిలియన్ డాలర్లు మాత్రమే ఆర్జిస్తున్నాం. మనం కూడా ఆ దిశగా ప్రయాణం చేయడానికి ఇలాంటి సదస్సులు ఉపయోగపడతాయి. మన ఉత్పత్తులను ప్రాసెస్ చేయడం ద్వారా మంచి ధరలు పొందవచ్చు. దీనికి పరిష్కారం వేస్ట్ టు వెల్త్. దీని ద్వారా సమస్యలు పరిష్కారం చూపవచ్చు' అని సీఎం అన్నారు

**ప్రభుత్వం నుంచి అన్నిరకాల ప్రోత్సాహం..** '1995లో నాడు ఐటీ అన్నాను..నేడు ఎఐ అంటున్నాను. మనం టెక్నాలజీని స్వాగతించాలి. ఖర్చులు తగ్గించుకునేందుకు, నాణ్యత పెంచేందుకు ఎఐను ఆక్వారంగంలోనూ విరివిగా వాడాలి. రొయ్యల రైతులు రకరకాల వైరస్‌ల కారణంగా నష్టపోతుంటాయి. వీటి సమాచారాన్ని ఎఐ ద్వారా విశ్లేషించి ఏ జబ్బులు వచ్చే అవకాశం ఉందనేది కూడా తెలుసుకోవచ్చు. తద్వారా సరైన మందులతో ముందుగానే తగు చర్యలు తీసుకోవచ్చు. ఎఐ అనేది నేను చెపుతుంటే కొందరు అర్థం చేసుకోవడం లేదు. కానీ తప్పదు ఏఐ టూల్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలి. టెక్నాలజీ, అవకాశాలను అందిపుచ్చుకుంటేనే సత్వర ఫలితాలు వస్తాయి. డాటా ఆధారంగా రాబోయే రోగాన్ని ముందే కనిపెట్టి చెప్పవచ్చు. మరోవైపు పంటల ఉత్పత్తితో పాటు...ప్రాసెసింగ్ ఉంటేనే అగ్రో బేస్డ్ ఇండస్ట్రీకి భవిష్యత్ ఉంటుంది.

# తెలంగాణ భవిష్యత్తు ముఖ్యమంత్రి బి.సి.నే..!

- కాస్త ఓపిక పట్టండి ప్లీజ్...! ● తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



**హైదరాబాద్,ఫిబ్రవరి 18 (వార్తాప్రభ) :** 'కాంగ్రెస్ పార్టీని ఎవరూ ఓడించలేరు. అది తనని తాను ఓడించుకున్నప్పుడే ఇతర పార్టీలకు అధికారంలోకి వస్తుంటాయి..' అనే రాజకీయ నానుడి చాలా పాతది. తెలంగాణ కాంగ్రెస్ దీనిని మరోసారి నిరూపించి చూపేందుకు సిద్ధమవుతోంది. టీడీపీ నుంచి వచ్చిన రేవంత్ రెడ్డికి పీసీసీ అధ్యక్ష పదవి, ఆ తర్వాత ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టడంపై తెలంగాణ కాంగ్రెస్ సీనియర్లు జీర్ణించుకోలేకపోవడం అందరూ చూశారు. కానీ ఆ దేశముదురు సీనియర్లలో ఏ ఒక్కరూ పార్టీని ఎన్నికలలో గెలిపించి అధికారంలోకి తీసుకు రాలేకపోయారు. వారికి ఆ సామర్థ్యం లేదని కాంగ్రెస్ అధిష్టానం గ్రహించినందునే రేవంత్ రెడ్డికి పగ్గాలు అప్పగించింది. ఆయన ఎన్నికలలో పార్టీని గెలిపించుకొని, అధికారంలోకి తీసుకువచ్చి అధిష్టానం మెప్పు పొందారు. కనుకనే అధిష్టానం మద్దతు ఉన్న రేవంత్ రెడ్డికి సీనియర్లు అందరూ భజన చేస్తూ 15 నెలలు కాలక్షేపం చేశారు. కానీ ఎల్లకాలం భజన చేయలేరు. కనుక మెల్లగా రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీలో గొంతు వినిపిస్తోంది. రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా ఎవరో మాట్లాడితే అర్థం చేసుకోవచ్చు. సాక్షాత్ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయనేమన్నారంటే, "కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఎప్పుడూ ప్రాధాన్యం ఇస్తుంది. తెలంగాణకు బీసీ ముఖ్యమంత్రి ఉం డాలని రాహుల్ గాంధీ అనుకున్నారు. కనుక ఆయన నిర్ణయం మేరకు వచ్చే ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వంలో బీసీ ముఖ్యమంత్రి వస్తారు. అంతవరకు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగుతారు. వచ్చే ఎన్నికలలో బీసీలు, బీసీ ముఖ్యమంత్రి ప్రధానాంశంగా ఉండబోతున్నాయి," అని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో తప్ప మరేపార్టీలో ఈవిదంగా ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా మాట్లాడటం వినబడదు. రేవంత్ రెడ్డిపై కాంగ్రెస్ నేతలకే నమ్మకం, గౌరవం లేనప్పుడు ప్రతిపక్ష పార్టీలకు ఎందుకుంటుంది?తనకు పార్టీ నేతల మద్దతు లేదని తెలిసి ఉన్నప్పుడు, ముఖ్యమంత్రిలో అ భద్రతా భావం పెరగదా..?ఆ ప్రభావం ఆయన నిర్ణయాలు, పాలనపై పడవా..?అంటే తప్పకుండా పడతాయి. కనుక ఇప్పుడు రేవంత్ రెడ్డి బిఆర్ఎస్ కంటే ముందు సొంత పార్టీ నేతలతోనే అంతర్గత పోరాటాలు చేస్తూ పార్టీపై, ప్రభుత్వంపై పట్టు నిలుపుకునేందుకు ప్రయత్నించక తప్పదు. అంటే తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత పోరాటాలు ప్రారంభం కాబోతున్నాయని అనుకోవచ్చు. కనుక కాంగ్రెస్ పార్టీ మరోసారి తనని ఓడించుకొని బిఆర్ఎస్ పార్టీకి అధికార పగ్గాలు అప్పగించేందుకు సన్నాహాలు ప్రారంభించిందనే భావించవచ్చు. బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ కూడా "కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మేము కూల్చనక్కరలేదు.. వాళ్ళే కూలచేసుకొని మాకు అధికారం అప్పజెప్పేస్తారు," అని చెపుతున్నారు కదా?

# సృజనాత్మకతతో కూడిన విద్య నందించడమే ఎపి ప్రభుత్వ లక్ష్యం

- విద్యా నైపుణ్యాల పెంపుదలకు సింఘానియా ట్రస్ట్ తో ఒప్పందం
- మంత్రి నారా లోకేష్ సమక్షంలో సింఘానియా గ్రూప్ ఎంఓయు



**అమరావతి,ఫిబ్రవరి 18 (వార్తాప్రభ) :** జాతీయ విద్యావిధానం లక్ష్యసా ధనలో భాగంగా రాష్ట్రంలో విద్యానైపుణ్యాల అభివృద్ధి చేసేందుకు సులోచనాదేవి సింఘానియా స్కూల్ ట్రస్ట్ తో ఎపి ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఈ మేరకు ఉండవల్లి నివాసంలో ఎపి ప్రభుత్వంతో ఈ మే రకు సింఘానియా గ్రూప్ (రేమండ్స్), ఎపి ప్రభుత్వ ప్రతినిధుల నడుమ అవగాహన ఒప్పందం చేసుకుంది. ఇందులో భాగంగా తొలుత ట్రస్ట్ ఆధ్వర్యాన తిరుపతి జిల్లాలోని 14 పాఠశాలల్లో ఉపాధ్యాయుల పని తీరు, నాణ్యత, ఉపాధ్యాయ శిక్షణ, స్పోకెన్ ఇంగ్లీషు శిక్షణ, జాతీయ విద్యావిధానంతో సమాంతరంగా, సాంకేతికత అనుసంధానం వంటి అంశాల్లో విద్యా నైపుణ్యాన్ని తీసుకురావడం ద్వారా పాఠశాలల నిర్వహణలో మార్పులు తేవాలని నిర్ణయించారు. ఐదేళ్ల వ్యవధిలో అమలుచేసే ఈ కార్యక్రమం ద్వారా 1 లక్ష మంది విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుంది. ఆ తర్వాత అమరావతి, విశాఖపట్నం, కాకినాడకు కూడా ట్రస్ట్ సేవలను విస్తరిస్తారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... రాబోయే ఎపిలో విద్యారంగాన్ని దేశంలోనే నెం.1గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటివరకు అమలుచేస్తున్న మూస పద్ధతులకు స్వస్తిచెప్పి సృజనాత్మకత పెంపొందించేలా కెజి టు పిజి విద్య కరిక్యులమ్ లో సమూల మార్పులు తెస్తున్నామని చెప్పారు. కళాశాల నుంచి బయటకు వచ్చే విద్యార్థికి వెనువెంటనే ఉద్యోగం లభించేలా నైపుణ్యాలను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. సింఘానియా గ్రూప్ చైర్మన్ గౌతమ్ హరి సింఘా నియా మాట్లాడుతూ... విద్యార్థులను ఉన్నత సాంకేతిక పరిజ్ఞానంతో నైపుణ్యవంతంగా తయారు చేయడమే తమ లక్ష్యమని అన్నారు. పిల్లలకు మరింత ప్రభావవంతమైన, ఆకర్షణీయమైన అభ్యసన విధానాల్లో బోధన చేసేందుకు వీలుగా ఉపాధ్యాయుల సామర్థ్యాలను బలోపేతం చేసేందుకు విజయవాడ, వైజాగ్, అమరావతిలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. పాఠ్యాంశాల్లో సాంకేతికతను సమగ్రపరచడం, ఆంగ్లంలో విద్యార్థుల కమ్యూనికేషన్ నైపుణ్యాలను బలోపేతం చేయడం ద్వారా విద్య నాణ్యతను పెంచడం ఈ సహకారం లక్ష్యం. ఉపాధ్యాయులను ఆధునిక సాంకేతికతతో సన్నద్ధం చేయడంతోపాటు డిజిటల్ సాధనాలను ఉపయోగించేలా శిక్షణ ఇస్తాం. ఆంగ్ల భాషా ప్రావీణ్యానికి ప్రాధాన్యత ఇవ్వడం వల్ల ఉన్నత విద్య, కెరీర్ అవకాశాలకు అవసరమైన అవసరమైన నైపుణ్యాలు కలిగిన విద్యార్థులు తయారవుతారని అన్నారు. సింఘానియా గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరక్టర్ రేవతి శ్రీనివాసన్ మాట్లాడుతూ... విద్య ప్రగతికి పునాది, ఈ భాగస్వామ్యం ద్వారా స్థానిక తరగతి గదులకు ప్రపంచ ఉత్తమ పద్ధతులను పరిచయం చేయడమే మేము లక్ష్యంగా పెట్టుకున్నాం. ఉపాధ్యాయుల శిక్షణ, సాంకేతికతతో కూడిన అభ్యాసం, ఆంగ్ల ప్రావీణ్యంపై దృష్టి సారించాం. విద్యార్థులను విద్యాపరంగా సుసంపన్నం చేయడమే కాకుండా భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే నైపుణ్యవంతమైన విద్యను పొందేలా చేస్తుంది. ఈ భాగస్వామ్యం అకడమిక్ ఎక్సలెన్స్, సమగ్ర అభివృద్ధిని పెంపొందించడానికి దోహద పడుతుంది. రాబోయే 5 సంవత్సరాలలో సింఘానియా గ్రూప్ విజయవాడ, కాకినాడ, విశాఖ పట్నంలలో ఉపాధ్యాయ శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక అనుసంధానం వంటిపై శిక్షణ ఇచ్చి విద్యాస్థాయిని పెంచుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రేమాండ్స్ ఇండిపెండెంట్ డైరక్టర్ కె.నరసింహ మూర్తి, కార్పొరేట్ ఎఫైర్స్ హెడ్ జతిన్ ఖన్నా, సింఘానియా ట్రస్ట్ ప్రిన్సిపాల్ రేవతి శ్రీనివాసన్, కార్పొరేట్ కమ్యూనికేషన్స్ హెడ్ రోహిత్ ఖన్నా, చీఫ్ గార్మెంటింగ్ బిజినెస్ ఆఫీసర్ మనీష్ భారతి, రేమాండ్స్ ఇంజనీరింగ్ బిజినెస్ సిఇఓ గౌతమ్ మైనీ, చీఫ్ ఫైనాన్సియల్ ఆఫీసర్ నవీన్ శర్మ, చైర్మన్ సెక్రటరీ అతుల్ ఖేల్కర్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ శాఖల మధ్య భూవివాదాల సత్వర పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ

- రెవిన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ పి సిసోడియా
- అటవీ, రెవిన్యూ శాఖల సరిహద్దు సమస్యల పరిష్కారం దిశగా ముందడుగు
- మూరిటైమ్ బోర్డుకు భూ కేటాయింపుపై స్పష్టత నిచ్చిన సమావేశం
- అటవీ శాఖకు ప్రత్యామ్నాయ భూమి కేటాయింపుకు ఆదేశాలు
- కోర్టు పరిధిలో ఉన్న అంశాల పరిష్కారంపై మరింత సమాచారం



**అమరావతి, ఫిబ్రవరి 18 (వార్తాప్రభ) :** న్యాయపరమైన వివాదాలకు తావు లేకుండా ప్రభుత్వ శాఖల మధ్య నెలకొన్న భూసమస్యలకు ముగింపు పలికేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు రెవిన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (భూపరిపాలన, సర్వే సెటిల్ మెంట్, స్టాంపులు రిజిస్ట్రేషన్లు, విపత్తుల నిర్వహణ), ఆంధ్రప్రదేశ్ మానవవనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ ఆర్ పి సిసోడియా అన్నారు. అటవీ, రెవిన్యూ శాఖల మధ్య నెలకొన్న భూవివాదాల పరిష్కారం ధ్యేయంగా మంగళవారం రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో అత్యున్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రెవిన్యూ, సర్వే సెటిల్ మెంట్, అటవీ, మారిటైమ్ బోర్డు, ఎపిఐఐసి ఉన్నతాధికారులతో నిర్వహించిన ఈ సమావేశాన్ని భూపరిపాలన విభాగపు చీఫ్ కమీషనర్ జయలక్ష్మి సమన్వయ పరిచారు. ఈ సందర్భంగా సిసోడియా మాట్లాడుతూ ఉన్నత స్థాయి అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లి వాస్తవ సరిస్థితులను అధ్యయనం చేసినప్పుడే సరిహద్దు వివాదాలకు ముగింపు లభిస్తుందన్నారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ఇబ్బంది కలిగిస్తున్న భూవివాదాలకు సత్వరమే పరిష్కారం చూపవలసి ఉందని, మంచి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం రాజాపురం గ్రామం మూలపేటలో 408.67 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎపి మారీటైమ్ బోర్డుకు బదలాయించే అంశాన్ని ఉన్నత స్థాయి సమావేశం చర్చించింది. సర్వే నెంబర్ 299, 304, 305లలోని ఈ భూమిలో మూలపేట గ్రీన్ ఫీల్ట్ పోర్టు నిర్మాణం చేయాలన్న ప్రతిపాదనకు కమిటీ సమ్మతి తెలిపింది. ఈ భూమికి సంబంధించి అటవీ, రెవిన్యూ శాఖ మధ్య నెలకొన్న వివాదాలను పరిష్కరించే దిశగా సిసిఎల్ఎ వ్యవహరించాలని సిసోడియా స్పష్టం చేసారు. మారీటైమ్ బోర్డు కోరుతున్న భూమిలో అటవీ భూమి కూడా ఉన్నందున ఆ శాఖకు ప్రత్యామ్నాయంగా ఎక్కడ భూమి చూపాలన్న దానిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. నెల్లూరు రూరల్ మండలం అమనచర్ల గ్రామంలోని సర్వే నెంబర్ 303/1లోని 502.12 ఎకరాల భూమి విషయంలో ఎపిఐఐసి, అటవీ శాఖ మధ్య యాజమాన్య హక్కుల విషయంలో వివాదం నెలకొంది. సుదీర్ఘ చర్చ అనంతరం ఈ అంశం న్యాయ పరమైన వివాదాలతో అనుసంధానం అయిఉన్నందున ఈ అంశంపై మరింత స్పష్టత అవసరమని సమావేశం అభిప్రాయపడింది. మరింత సమాచారం, న్యాయ సలహా మేరకే తగిన చర్యలు తీసుకోవాలని సిసోడియా, జయలక్ష్మి స్పష్టం చేసారు.కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం బ్రాహ్మణపల్లి, శకునాల గ్రామాల పరిధిలోని 365.66 ఎకరాల విషయంలో నెలకొన్న సరిహద్దు వివాదంపై కూడా సమావేశం లోతుగా చర్చించింది. గని రిజర్వ్ పారెస్ట్ కు, అక్కడ నిర్మాణం కావాలసిన గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు భూములకు మధ్య సరిహద్దు రేఖ పరంగా అస్పష్టత నెలకొంది.

# భూ భారతి స్ఫూర్తితోనే విధి విధానాలు

- తెలంగాణ ప్రజల ఆశలు ఆకాంక్షలకు అనుగుణంగా భూభారతి చట్టం చేశాం
- విధివిధానాలపై కలెక్టర్లతో వర్క్ షాప్
- రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్,ఫిబ్రవరి 18 (వార్తాప్రభ) :** ప్రజాస్వామ్యయుతంగా అసెంబ్లీలో డ్రాఫ్ట్ బిల్లు పెట్టి ఆ తర్వాత మేధావులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సలహాలు సూచనలు తీసుకొని దేశానికి ఆదర్శంగా ఉండేలా భూ భారతి ఆర్వోఆర్ 2025 చట్టాన్ని తీసుకువచ్చామని అదే స్ఫూర్తితో ఈ చట్టానికి సంబంధించిన విధివిధానాలను రూపొందిస్తున్నామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. తెలంగాణ ప్రజల ఆశలు ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజానీకానికి మెరుగైన, సమగ్రమైన రెవెన్యూ సేవలను సత్వరమే అందించాలన్న ఆశయంతో, విస్తృత స్థాయిలో అభిప్రాయాలను సేకరించి గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి ఆలోచనలకు అనుగుణంగా భూభారతి చట్టాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. భూభారతి చట్టం రూపకల్పనకు ఎంత కష్టపడ్డామో ఈ చట్టానికి సంబంధించిన విధివిధానాలను తయారు చేయడానికి అదే స్థాయిలో కసరత్తు చేయాలని అధికారులను కోరారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేలా చిన్న చిన్న తప్పులకు ఆస్కారం లేకుండా పకడ్బందీగా విధివిధానాలను రూపొందించాలని అధికారులకు సూచించారు. భూభారతి చట్టానికి సంబంధించి విధివిధానాలను రూపొందించడంపై హైదరాబాద్ లోని ఎం.సీ.ఆర్.హెచ్.ఆర్.డి.లో కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న వర్క్ షాప్ లో మొదటి రోజు మంగళవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ "ఎలాంటి విధి విధానాలు తయారు చేయకుండానే 2020 ఆర్వోఆర్ చట్టాన్ని ఆనాటి ప్రభుత్వం అమలులోకి తీసుకురావడంతో ఎదురైన ప్రతికూల పరిస్థితులు మన కళ్లముందే కనిపిస్తున్నాయి. ఆనాటి పాలకులు గొప్పగా చెప్పుకున్న ధరణిలో అన్ని లొసుగులు, లోపాలే. నిబంధనల రూపకల్పన లేకుండానే అమలులోకి తీసుకువచ్చిన 2020 ఆర్ఓఆర్ చట్టం వల్లే లక్షలాది మంది రైతులు రోడ్డున పడ్డారు. చట్టం తీసుకువచ్చి మూడు సంవత్సరాలు గడచినా కూడా ఆనాటి ప్రభుత్వం విధివిధానాలను రూపొందించలేదు. సచివాలయంలో కూర్చొని రూల్స్ ఫ్రేమ్ చేయకుండా విస్తృత స్థాయిలో అధికారులు, మేధావులు, అనుభవజ్ఞుల సలహాలు సూచనలు తీసుకొని అందరి అభిప్రాయాలను క్రోడీకరించి పకడ్బందీగా భూ భారతి విధివిధానాలు తయారు చేస్తున్నాం. వీలైనంత త్వరగా భూభారతి చట్టానికి సంబంధించిన విధివిధానాలను తయారుచేసి చట్టాన్ని అమలులోకి తీసుకువస్తాం. కొత్త సమస్యలు రాకుండా ఉన్న సమస్యలు పరిష్కారం అయ్యేలా రైతులకు ప్రయోజనం కలిగేలా, అధికారులు తప్పుచేయడానికి ఆస్కారం లేకుండా విధివిధానాలను రూపొందిస్తున్నాం. తెలంగాణలో నూతన రెవెన్యూ చట్టం భూభారతి భూ పరిపాలనలో పెను మార్పులను తీసుకురాబోతుంది. భూ హక్కులను రక్షించడం, భూ వ్యవహారాలలో పారదర్శకత తీసుకురావడం భూ లావాదేవీలను సులభతరం చేయడం, సామాన్యులకు సైతం రెవెన్యూ సేవలను అందుబాటులోకి తీసుకురావడం ఈ చట్టం ప్రధాన లక్ష్యం. ఈ చట్టం తరతరాల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతుంది. భవిష్యత్తులో మరింత మెరుగైన విధానాలు, సాంకేతికతను ఉపయోగించుకొని భూ పరిపాలనను మరింత సమర్ధవంతంగా కొనసాగిస్తాం.

## పదవ తరగతి మార్క్స్ మెమో పోయినది

ఇబ్రహీంపట్నం నుండి పశ్చిమ ఇబ్రహీంపట్నం (కొత్తూరు) వెళ్ళుచుండగా మార్గమధ్యలో పదవ తరగతి మార్క్స్ మెమో పోయినది.ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్సుకు తెలియజేయగలరు.

**షేక్ సాజిదా**
**D/O షేక్ న్యామతుల్లా, పశ్చిమ ఇబ్రహీంపట్నం, ఎన్టీఆర్ జిల్లా**

# ఏపీలోని వర్సిటీలకు వైస్ ఛాన్సలర్ల నియామకం

**అమరావతి,ఫిబ్రవరి 18 (వార్తాప్రభ) :** ఏపీలోని పలు వర్సిటీలకు వైస్ ఛాన్సలర్లను నియమిస్తూ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆంధ్రా వర్సిటీ వీసీగా ప్రొఫెసర్ జి.పి. రాజశేఖర్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన ఐఐటీ ఖరగ్‌పూర్‌లో గణితశాస్త్ర ఆచార్యునిగా చేస్తున్నారు. కాకినాడ జేఎన్టీయూ వీసీగా ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కె.ప్రసాద్‌ను నియమించారు. ప్రస్తుతం ప్రసాద్.. వరంగల్ నిట్‌లో సివిల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్‌గా ఉన్నారు. యోగి వేమన వర్సిటీకి వీసీగా ప్రొఫెసర్‌గా పి.ప్రకాశ్‌బాబును నియమితులయ్యారు. ప్రస్తుతం ఈయన హెచ్‌సీయూ, స్కూల్ ఆఫ్ లైఫ్‌సైన్సెస్‌లో బయో టెక్నాలజీలో సీనియర్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. వీరంతా మూడేళ్లపాటు ఆయా వర్సిటీలకు వీసీగా కొనసాగనున్నారు. వర్సిటీలు – నూతన వీసీలు, రాయలసీమ వర్సిటీ – వెంకట బసవరావు, అనంతపురం జేఎన్టీయూ – హెచ్.సుదర్శనరావు, తిరుమల పద్మావతి మహిళా వర్సిటీ – ఉమ, మచిలీపట్నం కృష్ణా వర్సిటీ – కె.రాంజీ, ఆదికవి నన్నయ వర్సిటీ – ప్రసన్న శ్రీ, విక్రమ సింహపురి వర్సిటీ – అల్లం శ్రీనివాసరావు

# కెసిఆర్ ఫ్లెక్సీలు తీస్తే తీయండి... నా ఫ్లెక్సీలు మాత్రం తియ్యకండి.

**ఇది కూకట్ పల్లి ఎమ్మెల్యే ధోరణి, బెదిరింపులు**
**- కాంగ్రెస్ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు ఎం యుగంధర్ రెడ్డి**



**కూకట్ పల్లి,ఫిబ్రవరి 18(వార్తాప్రభ):**బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఫ్లెక్సీలను తీస్తే తీయండి కానీ ఈనెల 19న తన జన్మదినం సందర్భంగా అభిమానులు ఏర్పాటు చేసే ఫ్లెక్సీలను మాత్రం తియ్యొద్దని దయచేసి ప్రాధేయపడుతున్నానని చెప్పకనే చెబుతున్నడు కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అని కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ ఎద్దేవా చేశాడు. ఫ్లెక్సీల తొలగింపు విషయంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సుప్రీం కోర్టు ఆదేశాలను అమలు చేస్తూ, పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న అధికారులను ఒక ఎమ్మెల్యేగా ఉండి నోటికి వచ్చినట్లు తిట్టడం ఎంతవరకు సమంజసమని కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు వాళ్ళ విధులు నిర్వహించనీయకుండా ఎమ్మెల్యే బెదిరిస్తున్నారని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీకి... ఫ్లెక్సీల తొలగింపుకు సంబంధం లేదు. ఫ్లెక్సీల కు సంబంధించిన చట్టం గురించి బిఆర్ఎస్ ప్రభుత్వమే గత పదేళ్లలో ఒక్కటి కూడా ఉండకుండా తిగించిందని చెబుతున్న ఎమ్మెల్యే, మరి ఇప్పుడు ఫ్లెక్సీల తొలగింపుకు వ్యతిరేకంగా ఎందుకు మాట్లాడుతున్నాడని పేర్కొన్నారు. కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కాంగ్రెస్ పార్టీని తిట్టడమే పనిగా పెట్టుకున్నాడని తీవ్రంగా విమర్శించారు.కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఓపిక కోల్పోతున్నాడన్నారు.

# మల్లంపేటలో ఇకనైనా ట్రాఫిక్ సమస్య తీరేనా

**రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం ట్రాఫికు తీవ్ర అంతరాయం**
**రోజు కిలోమీటర్ల మేర భారీగా ట్రాఫిక్ జాం**
**ఇబ్బంది పడుతున్న వాహనదారులు**



**దుండిగల్ ఫిబ్రవరి 18 (వార్తాప్రభ) :** విశ్వ నగరంగా ఎదుగుతున్న హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్య మాత్రం తీరడం లేదు, హైదరాబాద్ నగర శివారు మల్లంపేటలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకి జటిలమవుతుంది. ఇక్కడ రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం జరుగుతుండడంతో ఈ రూట్ లో ప్రయాణించే వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ వైపు ఓ ఆర్ ఆర్ ఎగ్జిట్ ఉండడంతో వాహనదారులు నిత్యం ఇదే రోడ్డు గుండా ప్రయాణాలు కొనసాగిస్తుంటారు. ఎంతోమంది తమ పనిలో భాగంగా ఆఫీసులకు, కార్యాలయాలకు ఈ రూట్ లోనే వెళు తుంటారు. ఒకవైపు గుంతల రోడ్లు మరొ వైపు దుమ్ము ధూళి లొ ప్రయాణం తొ వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అంటే ఎంతో నరకయాతన గా ఉంటుంది. అలాంటిది మల్లంపేటలొ రోజు ఇదే తంతు కొనసాగుతుంది. అధికారులకు ట్రాఫిక్ సమస్యపై ఎన్ని ఫిర్యాదులు అందిన చర్యలు మాత్రం శూన్యం, ట్రాఫిక్ ని కంట్రోల్ చేయాల్సిన ట్రాఫిక్ పోలీసులు కూడా చేతులెత్తేస్తున్నారు. ఇకనైనా అధికారులు చొరవ చూపించి రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేసి ట్రాఫిక్ సమస్య నుండి విముక్తి కలిగించాలని వాహనదారులు కోరుతున్నారు.

# గ్రంథాలయ అధునాతన భవనం ఆకట్టుకునేలా ఉంది.

**- విశ్రాంత ఉద్యోగులుగా తమ వంతు సహకారం అందిస్తాం.**

**భద్రాద్రి కొత్తగూడెం ఫిబ్రవరి 18 (వార్తాప్రభ)** గ్రంథాలయం కోసం ఏర్పాటు చేసిన నూతన భవనం కార్పొరేట్ స్థాయిలో ఆకట్టుకునేలా ఉందని విద్యానగర్ కాలనీ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కొల్లు నాగేశ్వరరావు, కార్యదర్శి సురేష్ కుమార్ అన్నారు. మంగళవారం నూతన గ్రంథాలయ భవనాన్ని సందర్శించిన వారు అందుబాటులోనికి తెచ్చిన సదుపాయాలు సౌకర్యాల పై స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వపరంగా కార్పొరేట్ స్థాయిలో చక్కటి వాతావరణం ఆహ్లాదకరమైన పరిస్థితుల నడుమ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ నూతన భవనం లోని ఏర్పాట్లను చూస్తుంటే ఇది నిజంగా ప్రభుత్వ కార్యాలయమైన అనే అనుమానాలు వ్యక్తం కాక మానవని చెప్పారు. ఇక్కడున్న సదుపాయాలను చూస్తుంటే వేరే రేంజ్ లో ఉన్నాయని, విద్యార్థులు కూర్చుని చదువుకునేందుకు అన్ని రకాల పుస్తకాలను అందుబాటులోకి తేవడం గమనార్హం అని చెప్పారు. గ్రంథ పాలకురాలుగా పనిచేస్తున్న మణి మృదుల విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పోటీ పరీక్షలకు సిద్ధపడే వారికి అనునిత్యం అందుబాటులో ఉంటూ సహకారం అందిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈ మధ్యకాలంలో గ్రంథాలయం పై ఆధారపడి చదివిన అనేకమంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం వెనుక గ్రంథ పాలకురాలి కృషి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుందని తెలిపారు. గతంలో మాదిరిగానే నూతన గ్రంథాలయానికి కూడా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని, పోటీ పరీక్షలకు సిద్ధపడే వారికి విశ్రాంత ఉద్యోగుల తరపున సహకరిస్తామని చెప్పారు.

# టార్గెట్ వికసిత్ భారత్ విత్ మైనింగ్!!

- "క్రిటికల్ మినరల్స్ మైనింగ్"లో అధ్యయనం
- పర్యావరణ పరిరక్షణకు విశిష్ట కృషి
- సింగరేణి సిఎండి బలరాం నాయక్






**పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 18 (వార్తాప్రభ ప్రతినిధి)** టార్గెట్ వికసిత్ భారత్ విత్ మైనింగ్ అని తెలిపారు సింగరేణి సిఎండి బలరాం నాయక్. ఈ మేరకు మంగళవారం ఎంఈఏఐ జాతీయ సదస్సులో పాల్గొన్న సీఎండి మాట్లాడారు. వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవడంలో మైనింగ్ రంగంది కీలక పాత్ర అని తెలిపారు. క్రిటికల్ మినరల్స్ మైనింగ్ లో అవకాశాలపై సింగరేణి అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రోత్సాహంతో క్రిటికల్ మినరల్స్ అన్వేషణలో ఉన్న అవకాశాలపై సింగరేణి ఆధ్వర్యంలో అధ్యయనానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు సైతం విశిష్ట కృషితో సింగరేణి ముందుకు వెళుతున్నదని తెలిపారు. ఈ సదస్సులో ఎన్ఎండిసి డైరెక్టర్, ఎంఈఏఐ చైర్మన్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

# మోడీ పాలనే దేశానికి శ్రీరామరక్ష!!

- భారత్ ప్రగతి బిజెపి ద్వారానే
- అన్ని వర్గాల అభ్యున్నతికి కమలం, కాషాయం
- గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలలో బిజెపినే గెలిపించండి
- రామగుండం బిజెపి ఇంచార్జ్ కందుల సంధ్యారాణి



**పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 18 (వార్తాప్రభ ప్రతినిధి)** మోడీ పాలనే దేశానికి శ్రీరామరక్ష అని తెలిపారు రామగుండం బిజెపి ఇంచార్జ్ కందుల సంధ్యారాణి. ఈ మేరకు మంగళవారం నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలలో గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బిజెపి గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి అయిన చిన్నమైల్ అంజిరెడ్డిని, అలాగే బిజెపి టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్కా కొమురయ్యని మొదటి ప్రాధాన్యత ఓటు ద్వారా భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. భారత్ ప్రగతి బిజెపి ద్వారానే సాధ్యం అవుతున్నదని, అన్ని వర్గాల అభ్యున్నతికి కమలం, కాషాయం కృషి చేస్తున్నదని తెలిపారు. గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలలో బిజెపినే గెలిపించండి అని కరపత్రాలను అందజేశారు.

# దేశ భాషలందు "తెలుగు" లెస్స!!

- తెలుగు భాషలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పుష్కలం
- కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు
- భాషపై పట్టు ఉంటే భవిష్యత్తులో ఉన్నత స్థానంలో నిలుస్తారు
- చత్రపతి శివాజీ కళాశాల తెలుగు ఉపన్యాసకులు డాక్టర్ జి.వెంకట లాల్




**పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 18 (వార్తాప్రభ ప్రతినిధి)**దేశ భాషలందు "తెలుగు" లెస్స అని శ్రీకృష్ణదేవరాయలు చెప్పిన మాటను గుర్తు చేశారు జంగారెడ్డిగూడెం చత్రపతి శివాజీ కళాశాల తెలుగు ఉపన్యాసకులు డాక్టర్ జి.వెంకట లాల్. ఈ మేరకు మంగళవారం గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ మాతృభాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెంకట లాల్ హాజరైనారు. ప్రపంచ మాతృభాష దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు విస్తృత ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకట లాల్ తెలుగులో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు అనే అంశంపై అనర్గళంగా ప్రసంగించి విద్యార్థులకు పలు సూచనలను చేశారు. అనువాదం, వివరణ, కంటెంట్ రైటింగ్, జర్నలిజం, బోధన, విద్య, డబ్బింగ్, వాయిస్ ఓవర్, పర్యాటకం, ఆతిథ్యం తదితర రంగాలలో తెలుగు భాషకు ప్రాధాన్యం ఉన్నదని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా వారికి కళాశాల వైస్ ప్రిన్సిపల్ స్వాగతం పలికి, పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు డాక్టర్ సుబ్బారావు, శంకరయ్య, తిరుపతి, శారద, శ్రీదేవి, కిరణ్మయి, నరేష్, స్రవంతి, ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధికి శ్రయ శక్తుల కృషి చేస్తా - శాసనసభ్యులు అరిక పూడి గాంధీ



**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 18 (వార్తాప్రభ):**హాఫీజ్ పేట్ డివిజన్ పరిధిలోని జనప్రియ నగర్ ఫేస్ 1 , 2 అసోసియేషన్ సభ్యుల అభ్యర్థన మెరకు యువ నాయకులు నిమ్మల దాత్రినాథ్ గౌడ్ స్వంత నిధులు రూ. 4 లక్షల రూపాయల అంచనా వ్యయం తో నూతనంగా ఏర్పాటు చేసిన 32 సీసీ కెమెరాల ను ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించిన పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ మాట్లాడుతూ జనప్రియ నగర్ నగర్ కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు దాత్రి నాథ్ గౌడ్ స్వంత నిధులతో 4 లక్షలు వెచ్చించి 32 సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావడం చాలా సంతోషకరమైన విషయం అని,దాత్రి నాథ్ గౌడ్ ని ప్రత్యేకంగా అభినందిస్తున్నాను అని పీఏసీ చైర్మన్ గాంధీ తెలియచేశారు.ప్రారంభించుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని,సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చిన దాత్రి నాథ్ గౌడ్ ని ప్రత్యేకంగా అభినదిస్తున్నాను అని,ప్రతి ఒక్కరికి,ఇతర కాలనీలకు ఆదర్శంగా నిలిచారు అని, సమాజ హితం ప్రతి ఒక్కరు ఎంతో కొంత దాతృత్వం చేయాలని,సమాజ హితం పాటుపడాలని పీఏసీ చైర్మన్ గాంధీ తెలియచేసారు,కాలనీ లలో నేరాలు అరికట్టడానికి సీసీ కెమెరాలు ఎంతగానో తోడ్పడుతాయి అని,కాలనీ వాసులు ముందుకు రావడం చాలా అభినందనీయం అని,సీసీ కెమెరా ల ఏర్పాటు కు చొరవ తీసుకోవడం చాల గొప్ప విషయం అని,శాంతి భద్రతలు కాపాడటానికి పోలీస్ అధికారులు ఎంతగానో కృషి చేస్తున్నారని,సీసీ కెమెరాల ఏర్పాటు పై కాలనీ వాసులకు విస్తృత ప్రచారం తో అవగాహన కలిపిస్తున్నారని,ఒక సీసీ కెమెరా 100 మంది పోలిసుల తో సమానమని,సీసీ కెమెరాల వలన కేస్ ల పరిష్కారం సులువు అవుతుంది అని,నేర శోధన ,నేర నివారణ కు ఎంతో తోడ్పడతాయి అని,కావున అన్ని కాలనీ వాసులు ముందుకు వచ్చి తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పీఏసీ చైర్మన్ గాంధీ తెలియచేశారు,సీసీ కెమెరాల ఏర్పాటుకు తనవంతు కృషి గా ఎమ్మెల్యే ఫండ్ (సీడీపీ) ద్వారా 1 కోటి రూపాయలు కేటాయించడం జరిగినది అని ఎమ్మెల్యే గాంధీ తెలియచేశారు.మహిళల,ప్రజల రక్షణకు,దొంగతనాలు ల్అరికట్టడానికి సి.సి.కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతుంది అని ,24 గంటల పాటు నిరంతరం పనిచేసే నిఘా నేత్రలను ప్రతి కాలనీ, బస్తీలో ఏర్పాటు చేసుకోవాలి అని ,.. ప్రతి కాలనీలో,బస్తీలో ఇలాంటి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంవలన దొంగతనాలు,నేరాలు జరిగినపుడు పోలీసులకు నేరస్తులను గుర్తించడంలో మరియు కీలక సమయం లో సాక్ష్యంగా ఎంతగానో ఉపయోగపడుతాయి అని పీఏసీ చైర్మన్ గాంధీ తెలియచేశారు.. అన్ని కాలనీల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తానని ,మరిన్ని నిధులు కేటాయించడానికి సిద్ధం అని ,ఏ చిన్న సమస్య వచ్చిన తన దృష్టికి వచ్చిన పరిష్కరిస్తానని ఎమ్మెల్యే గాంధీ తెలియచేసారు.అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని పీఏసీ చైర్మన్ గాంధీ అన్నారు.మాదాపూర్ డివిజన్ మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి శాయ శక్తుల కృషి చేస్తానని పీఏ సీ చైర్మన్ గాంధీ తెలియచేసారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఐ మాణిక్యం,జనప్రియ నగర్ ఫేస్ 1 ప్రెసిడెంట్ జయసూర్య,మల్లికార్జున్, సుధాకర్,దాసు ,ప్రవీణ్,శ్రీనివాస్ మరియు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా కార్యచరణ రూపొందించాలి

**కామారెడ్డి,ఫిబ్రవరి 18 (వార్తాప్రభ ప్రతినిధి)**రానున్న వేసవిలో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా కార్యచరణ రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో సాగునీరు, త్రాగునీరు, నిర్మాణ రంగానికి విద్యుత్ అంతరాయం కలగకుండా విద్యుత్ సరఫరా, రైతు భరోసా, రబీ సీజన్ కు సాగునీటి సరఫరా, యూరియా కొరత, రేషన్ కార్డుల జారీ, రెసిడెన్షియల్ పాఠశాలల సందర్శన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ వచ్చే వేసవికాలం దృష్ట్యా ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు లేకుండా కార్యచరణ రూపొందించి నిరంతరం నీటిని అందించే విధంగా ప్రణాళిక బద్ధంగా అమలు చేయాలని తెలిపారు. రబీ సీజన్ కొరకు సాగునీటి సమస్య లేకుండా ప్రాజెక్టులు, చెరువులపై సమీక్షించి ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. వ్యవసాయ సాగులో రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని, ఈ నేపథ్యంలో యూరియా కొరత లేకుండా చూడాలని తెలిపారు. వేసవికాలంలో వ్యవసాయానికి, త్రాగునీటికి, నిర్మాణ రంగానికి విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. అర్హత గల ప్రతి రైతుకు రైతు భరోసా అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజాపాలనలో రేషన్ కార్డుల కొరకు వచ్చిన దరఖాస్తులలో అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గురుకుల పాఠశాలలను జిల్లా అధికారులు సందర్శించి పాఠశాలలో నెలకొన్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులతో మాట్లాడుతూ, జిల్లాలోని 860 హాబిటేషన్స్ ఉండగా, 17 హాబిటేషన్సలో త్రాగునీటి సమస్య ఉందని, ఆయా గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా అయ్యే విధంగా చూడాలని తెలిపారు. పత్రికల్లో వచ్చే వ్యతిరేక వార్తలపై అధికారులు స్పందించి రేజాయిన్డర్ జారీ చేయాలని తెలిపారు. బోర్ వెల్స్ లను మరమ్మత్తులు చేయించాలని తెలిపారు.

# హైదరాబాద్

# సమగ్ర కులగణన చరిత్రాత్మక నిర్ణయం.

**- బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ను అభినందించిన కూన సత్యం గౌడ్.**



**కూకట్ పల్లి,ఫిబ్రవరి18(వార్తాప్రభ):**సమగ్ర కుల సర్వే నిర్వహించి, ఓబీసీల సాధికారత కోసం డేటాను ఉపయోగించాలనే చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన కార్యక్రమం దేశానికి దిశా నిర్దేశంగా ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో దేశంలోనే ప్రథమంగా మొదలుపెట్టి రికార్డ్ సృష్టిస్తూ విజయవంతంగా పూర్తి చేసిన బీసీ కుల గణన సర్వే సందర్భంగా శేర్లింగంపల్లి కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ కూన సత్యం గౌడ్ , శేర్లింగంపల్లి కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శిరీష సత్తూర్ తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ , రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువతో సన్మానం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో బాలాగౌడ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# కూకట్ పల్లి సిఐ రాజేష్ కు శుభాకాంక్షలు వెల్లువ.




**కూకట్ పల్లి,ఫిబ్రవరి 18(వార్తాప్రభ):**కూకట్ పల్లి నూతన సిఐ గా బాధ్యతలు చేపట్టిన సిఐ రాజేష్ ను మంగళవారం భారతీయ జనతా పార్టీ నేతలు కలిసి శాలువతో సత్కరించి పుష్పగుచ్చాలను అందజేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.ఈ నేరాల నియంత్రణకు సహకరించాలని సిఐ సూచించారు. ఈ నేపథ్యంలో ఎస్సై సతీష్ రెడ్డి ని శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వివేకానంద నగర్ డివిజన్ అధ్యక్షుడు డాక్టర్ వంశీ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వై. భాస్కర్ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, సిహెచ్. వేణుగోపాల్,బి.కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అత్యవసర విభాగంలో పనిచేసే పోలీసులకు డ్రైవింగ్ నైపుణ్యత చాలా ముఖ్యం




**కామారెడ్డి,ఫిబ్రవరి 18 (వార్తాప్రభ ప్రతినిధి)** కామారెడ్డి జిల్లా పోలీస్ కార్యల యంలో జిల్లా ఎస్పీ సింధుశర్మ ఆదేశా నుసారం జిల్లా లోని కొత్తగా నియామకం అయిన అన్నీ పోలీస్టేషన్లలో సిబ్బంది మరియు ఆర్మ్డ్ రిజర్వు సిబ్బందికి అత్యవసర పరిస్థితుల లో సిబ్బంది అందరికీ డ్రైవింగ్ రావాలని ముఖ్య ఉద్దేశంతో ఆరు వారాల పాటు మోటార్ వాహనాల డ్రైవింగ్ శిక్షణ తరగతులు వారి సబ్ డివిజన్లలో మరియు ఏ ఆర్ హెడ్ క్వార్టర్ నందు నిర్వహిచడం జరగుతుంది.జిల్లాలో పోలీస్ శాఖలోకి పురుషులతో పాటు మహిళా పోలీసు కానిస్టేబుల్స్ 9 నెలల శిక్షణ ముగించుకొని గత సంవత్సరం నవంబర్ నెలలో కామారెడ్డి జిల్లాలలో రిపోర్ట్ చేయడం జరిగింది. అదేవిధంగా పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న వారికి ముఖ్యముగా డ్రైవింగ్ ఎంతగానో ఉపయోగపడుతుంది అని చాలా మంది వాహన డ్రైవింగ్ సరిగ్గా నడపడం రాక, రహదారి భద్రత నియమ నిబందనలు తెలియక రోడ్డు ప్రమాదాల భారీనా పడుచున్నారని కావున అందరికీ కూడా సబ్ డివిజన్ ల మరియు విడతల వారీగా డ్రైవింగ్ పై శిక్షణ ఇవ్వడం జరుగుతున్నది. ఇప్పటికే కామారెడ్డిజిల్లాలో (75) మంది పోలీసు కానిస్టేబుల్స్ కు శిక్షణ ఇవ్వడం జరిగింది. అదేవిధంగా మిగతా వారికి కూడా డ్రైవింగ్ పై పూర్తి పట్టు వచ్చే విధంగా శిక్షణ అందిస్తాము. ఎస్పీ ఆదేశానుసారం జిల్లాలోని మహిళా కానిస్టేబుల్ లతో ప్రత్యేకముగా ఒక క్విక్ రియాక్షన్ టీం జిల్లాలో ఏర్పాటు చేయడం జరిగింది. వీరు ఎక్కడైనా శాంతి భద్రతల సమస్య తలెత్తినప్పుడు వెంటనే అక్కడికి చేరుకొని అక్కడ ఉన్న అధికారులకు మహిళలను అదుపు చేయటములో శాంతి భద్రతలను కాపాడటములో సహాయపడుతారు. అదేవిధంగా జిల్లా పట్టణ కేంద్రం మరియు వివిద పోలీసు స్టేషన్ ల పరిదిలో వాహన తనిఖీలు చేయడం, రైల్వే స్టేషన్, బస్ స్టేషన్ మరియు వివిధ రద్దీగల ప్రదేశాలలో తనిఖీలు చేస్తారు.

# ఎడిటోరియల్

## ఉత్తరాంధ్ర కు మహర్దశ...
## కూటమి ప్లాన్ అదుర్స్ !

ఉత్తరాంధ్ర జిల్లాలు ఉమ్మడి ఏపీలోనూ అలాగే విభజన ఏపీలోనూ అత్యంత వెనుకబాటుతనాన్ని కలిగి ఉన్నవని తెలిసిందే. ఒక్క విశాఖ సిటీ తప్పించి విశాఖ రూరల్ తో మొదలెడితే విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు పూర్తిగా వెనకబడి ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్ర మీద ఏపీలో అధికారంలో ఉన్న టీడీపీ కూటమి ప్రభుత్వం గట్టిగానే ఫోకస్ పెడుతోంది. ఉత్తరాంధ్రాకి ఇపుడు జీవనాడిగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉంది. దానిని కనుక సకాలంలో పూర్తి చేసినట్లు అయితే ఈ మూడు ఉమ్మడి జిల్లాల దశ తిరిగినట్లే అని అంటున్నారు. భోగాపురం ఎయిర్ పోర్టుని ప్రస్తుతం 22 వేల ఎకరాలలో నిర్మిస్తున్నారు . అయితే దానికి అదనంగా మరో అయిదు వందల ఎకరాలను కూటమి ప్రభుత్వం కేటాయిస్తూ తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. నిజానికి టీడీపీ ప్రభుత్వం 2018లో భోగాపురం వద్ద ఎయిర్ పోర్టు నిర్మాణం కోసం పాతిక వేల ఎకరాలను కేటాయించింది. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చకా దానిని తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే మరో అయిదారు వందల ఎకరాల భూమిని కనుక అప్పగిస్తే ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుతో పాటు ఎయిర్ కార్గోను కూడా ఏర్పాటు చేయడం అలాగే ఎయిర్ పోర్టు పరిసరాలలో అభివృద్ధి పనులకు ప్రాజెక్టులు రెడీ చేయడానికి వీలు ఉంటుందని ఈ విమానాశ్రయాన్ని నిర్మిస్తున్న జీఎమ్మార్ సంస్థ కూటమి ప్రభుత్వాన్ని కోరుతూ వస్తోంది. దీని మీద ఆర్ధిక మంత్రి పయ్యావుల కేశవ్ ఆధ్వర్యంలో మంత్రుల కమిటీని కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. భోగాపుప్రం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుకు అదనపు భూములు ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలను ఈ మంత్రుల కమిటీ పూర్తి స్థాయిలో అధ్యయనం చేసింది. ఆ మీదట తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మరో అయిదు వందల ఎకరాల భూమిని ఈ ఎయిర్ పోర్టుకు కేటాయిస్తూ ప్రభుత్వం ఆమోద ముద్ర వేయబోతోంది. ఇదే కనుక జరిగితే ఉత్తరాంధ్రాలో అతి పెద్ద ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుతో ఈ వెనకబడిన ప్రాంతం దశ తిరగనుంది అని అంటున్నారు. ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు కావడంతో దేశంలోని నలుమూల నుంచి మాత్రమే కాకుండా విదేశీయులు కూడా ఈ ఎయిర్ పోర్టుకి రాకపోకలు సాగిస్తారు. దాంతో ఎయిర్ ట్రాఫిక్ అధికం అవుతుంది. దాంతో అనుబంధ వ్యాపారాలు పుంజుకుంటాయని అంచనా వేస్తున్నారు. అదే విధంగా ఎయిర్ కార్గో టెర్మినల్స్ కి ఈ అయిదు వందల అదనపు భూములలో ఏర్పాటు చేయనుండడంతో దేశీయ విదేశీయ ఎగుమతులకు ఎంతో ఆస్కారం ఉంటుంది అని అంటున్నారు. ఇది ఉత్తరాంధ్రకే కాకుండా గోదావరి కోస్తా జిల్లాలకు కూడా ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని అంటున్నారు. ఇంటర్నేషనల్ కార్గో టెర్మినల్స్ వస్తే కనుక ఆక్వా ఫార్మా ఎగుమతులకు సులువైన మార్గం దొరుకుతుంది. అంతే కాకుండా స్థానిక ఉత్పత్తులకు విదేశీ మార్కెట్ కూడా దొరుకుతుంది. దాంతో వాణిజ్యం కూడా బాగా ఊపందుకుంటుంది అని అంటున్నారు. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు లొకేట్ అయి ఉన్నది కూడా ఉత్తరాంధ్రలోని కీలకమైన చోటనే. అది కూడా విశాఖ విజయనగరం శ్రీకాకుళం జిల్లాల మధ్యలోనే. దాంతో ఈ ఎయిర్ పోర్టు ఒక్కసారి కనుక ఆపరేషన్స్ స్టార్ట్ చేస్తే ఉత్తరాంధ్ర దశ అతి కొద్ది కాలంలోనే మారిపోతుందని అంటున్నారు. ఒక విధంగా చెప్పాలీ అంటే హైదరాబాద్ లోని శంషాబాద్ ఎయిర్ పోర్టు మాదిరిగానే ఇది కూడా సమీప భవిష్యత్తులో వెలుగొందుతుందని అంటున్నారు. దాంతో కూటమి ప్రభుత్వం కూడా భోగాపురం ఎయిర్ పోర్టు మీద ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోంది. మొదటి దశ పనులు 2026 నాటికి పూర్తి చేయాలని కూడా లక్ష్యంగా పెట్టుకున్నారు.

## వ్యవసాయ విశిష్ట సంఖ్య రైతు సేవాలో నమోదు చేసుకోండి



**చేజర్ల ఫిబ్రవరి 18 (వార్తాప్రభ)** రైతులందరూ విశిష్ట గుర్తింపు సంఖ్య కొరకు రైతు సేవ కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులను సంప్రదించి చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి శశిధర్ తెలిపారు. మంగళవారం ఎనమదల కోటితీర్థం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగినది. రైతులకు దీని కొరకు సొంత పొలం ఉన్న రైతులు వారి ఆధార కార్డుకు లింక్ అయిన ఫోన్ మరియు వన్ బి లేదా పట్టాదారు పాసుపుస్తకం తీసుకుని రావాలని తెలిపారు. రైతులకు ఏ లబ్ధి చేకూరాలన్న అన్నదాత సుఖీభవ వ్యవసాయ యాంత్రీకరణ పంటల భీమా విత్తన రాయితీతో మొదలైనవి అన్ని ఈ సంఖ్య ఆధారంగా రాబోయే రోజుల్లో ఉంటాయని తెలిపారు. అనంతరం రైతులు నమోదు ప్రక్రియ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సుజాత విఏఏ హసన్ కుమార్ రైతులు పాల్గొన్నారు

## ఆలపాటి గెలుపే లక్ష్యంగా ఎన్డీయే కూటమి నాయకుల ప్రచారం



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 18 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కృష్ణ గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు స్లిప్పులను భవానిపురం లోని ఎన్డీయే కార్యాలయంలో కూటమి నేతలు అందిస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎవరికైనా ఓటర్ స్లిప్పు అందకపోయినా జాబితాలో పేరు ఉన్నట్టయితే గుర్తింపు కార్డుతో ఓటు వేయచ్చని కూటమినేతలు సూచించారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాల మేరకు ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపే లక్ష్యంగా ఎన్డీయే కూటమి నేతలందరూ సమిష్టిగా కృషి చేస్తున్నామని ఎవరికైనా సందేహాలు ఉంటే నివృత్తి కొరకై భవానిపురం లోని ఎన్డీయే కార్యాలయంలో సంప్రదించాలని మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య తెలిపారు.

## ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) ఆదేశాలపై ఎమ్.ఎస్.ఎమ్.ఈ లోన్స్ పై అవగాహన సదస్సు

### ఖిద్మత్ ఘర్ కార్యాలయంలో విస్తృతస్థాయి సమావేశం



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 18 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయమైన ప్రతి కుటుంబంలో ఒక వ్యాపారవేత్త సాధన కోసం,ప్రజలందరితోపాటు ఎన్డీయే కూటమి కోసం అహర్నిశలు పని చేస్తున్న కార్యకర్తలు ఎమ్.ఎస్.ఎమ్.ఈ లోన్స్ ద్వారా ఎంటర్ ప్రెన్యూర్స్ గా మారి ఆర్థికంగా బలోపేతం కావటమే లక్ష్యంగా ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) కృషి చేస్తున్నారని ఎమ్.ఎస్.ఎమ్.ఈ లోన్స్ ప్రొగ్రామ్ కో-ఆర్డినేటర్ సంకే విశ్వనాథం అన్నారు. పశ్చిమనియోజకవర్గంలోని 53వ డివిజన్ పంజా సెంటర్ దగ్గర గణపతి రోడ్ లో గల ఖిద్మత్ ఘర్ కార్యాలయం లో మంగళవారం ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) ఆదేశాలపై ఎమ్.ఎస్.ఎస్.ఈ లోన్స్ పై ప్రజల్లో మరింతగా అవగాహన పెంచి వినియోగించుకునేందుకు టిడిపి పార్టీ కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్.ఎస్.ఎమ్.ఈ లోన్స్ ప్రొగ్రామ్ కో-ఆర్డినేటర్ సంకే విశ్వనాథం మాట్లాడుతూ ఎంపి కేశినేని శివనాథ్ ఆదేశాలపై ప్రజలందరూ ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ప్రతి డివిజన్ లో ఇలాంటి విస్తృతస్థాయి సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం టిడిపి నాయకులు మాట్లాడుతూ ఎమ్.ఎస్.ఎమ్.ఈ లోన్స్ కి ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలో వివరించి చెప్పటంతో పాటు , ప్రజలు పారిశ్రామికవేత్తలుగా మారటానికి బ్యాంక్ ల లోన్స్ విషయంలో పూర్తి సహాయ సహకారాలు ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు రావూరి సత్యనారాయణ, డివిజన్ కార్యదర్శి మధు, టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫతావుల్లాహ్, టిడిపి రాష్ట్ర తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు ఆషా, టి.ఎన్.టి.యు.సి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పాల మాధవ, మాజీ కార్పొరేటర్ కాకు మల్లిఖార్జున యాదవ్, టిడిపి నాయకులు ఇమ్రాన్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## గుండెకు సంబంధించిన ఇబ్బంది పడుతున్న వెంకటగిరి తెదేపా నాయకులు గల్లా శ్రీనివాసులు

### నీకు అండగా నేనున్నానంటూ గల్లా కి భరోసా ఇచ్చిన ఎమ్మెల్యే రామకృష్ణ




**విజయవాడ ఫిబ్రవరి 18 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఓట్లు దండుకొన్నామా..గెలిశామా...ఇక అంతే...ఆ తరువాత ఓటర్లు ముఖం గానీ...స్థానిక నాయకులను గానీ పూర్తిగా విస్మరించే నాయకులున్న ఈ రోజుల్లో కూడా తమ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన వారిని మర్చిపోకుండా ఆపదలో నేనున్నానంటూ భరోసా ఇచ్చిన ఓ ఎమ్మెల్యే కింది స్థాయి నాయకులు, కార్యకర్తలు మనో ధైర్యాన్నిచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న తెదేపా నేతను వెంకటగిరి ఎమ్మెల్యే రామకృష్ణ పరామర్శించిన తీరు పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత కాలంగాగుండె సమస్యతోబాధపడుతున్నజి తెదేపా పట్టణప్రధాన కార్యదర్శి గల్లాశ్రీనివాసు ని ఆయన నివాసంలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పరామర్శించారు. చికిత్స తీసుకుంటున్నఆసుపత్రి వివరాలు తెలుసుకున్నారు. తన గుండె కు సంభందించిన మూడు వాల్వ్ లు రక్త ప్రసరణ పూర్తి స్థాయిలో జరగడంలేదని వైద్యులు ఓపెన్ హార్ట్ సర్జరీ చెయ్యాల్సిన తప్పనిసరి పరిస్థితులు నెలకొన్నాయని తేల్చి చెప్పారని గల్లా శ్రీనివాసులు తాను పడుతున్న ఇబ్బందులు ఎమ్మెల్యే రామకృష్ణ కి విడమర్చి చెప్పారు. దాంతో ఎమ్మెల్యే రామకృష్ణ గల్లా శ్రీనివాసులు ఆరోగ్యం పూర్తి స్థాయిలో మెరుగవ్వాలని ఆకాంక్షించారు. తాము అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాటుగా నేతలు మధునాయుడు, గంగాధర్,రాజేశ్వరరావు, ఆనంద్, భాస్కరెడ్డి, చంద్రారెడ్డి, నరసింహులు, జన సేననేత అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## జీబీఎస్ వ్యాధిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

### వ్యాధి ఎదుర్కోవడానికి జిల్లా ఆసుపత్రి సిద్ధం- జిజిహెచ్ సూపర్డెంట్ ఆశాలత



**మచిలీపట్నం ఫిబ్రవరి 18 (వార్తాప్రభ ప్రతినిధి)**జీబీఎస్ (గులియన్ బారి సిండ్రోమ్) వ్యాధి పట్ల కృష్ణా జిల్లా ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సూపర్డెంట్ ఆశాలత అన్నారు. జీబీఎస్ వ్యాధి పై ప్రజలలో అవగాహన కల్పించారు. జీబీఎస్ వ్యాధి అంటువ్యాధి కాదని వ్యాధి సోకిన వారు కంగారు పడాల్సిన అవసరం లేదని, ప్రాథమిక స్థాయిలో గుర్తించి చికిత్స తీసుకుంటే వ్యాధి నయం చేయవచ్చన్నారు. జిపిఎస్ వ్యాధిని ఎదుర్కోవడానికి కృష్ణాజిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వైద్యులు, అధికారులు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సందర్భంగా సూపర్డెంట్ ఆశాలత మాట్లాడుతూ జీబీఎస్ (గులియన్ బారి సిండ్రోమ్) వ్యాధి అంటువ్యాధి కాదని కృష్ణా జిల్లా ప్రజలు భయపడాల్సిన అవసరం లేదన్నారు. జిల్లా సర్వజన ప్రభుత్వ ఆస్పత్రి లో జిబిఎస్ వ్యాధికి ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసామన్నారు. నోడల్ ఆఫీసర్ గా న్యూరో ఫిజీషియన్ కిరణ్ ను నియమించినట్లు ఆమె తెలిపారు. ఈ వ్యాధి ముఖ్యంగా నరాలకు సంబంధించిందని, కాళ్ళు తిమ్మిర్లు, నడవలేకపోవడం వంటి లక్షణాలు ఉంటే ఆసుపత్రిలో పరీక్ష చేయించుకోవాలని అన్నారు. ప్రాథమిక స్థాయిలో వ్యాధి లక్షణాలు గుర్తించి చికిత్స తీసుకోవాలని తెలిపారు. ఇప్పటివరకు కృష్ణాజిల్లాలో ఎటువంటి కేసులు నమోదు కాలేదు అని, వ్యాధిని ఎదుర్కోవడానికి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వైద్యులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డిప్యూటీ సూపర్డెంట్ డాక్టర్ శ్రీనివాస్, న్యూరాలజీ హెచ్ఓడి డాక్టర్ కిరణ్, పీడియాట్రిక్ హెచ్ఓడి డాక్టర్ గౌరీ తదితరులు పాల్గొన్నారు.

## సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాన్ పై బల్క్ వేస్ట్ జనరేటర్స్ తో సమావేశం

**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 18 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కార్యక్రమంలో భాగంగా వ్యర్థాలు ఎక్కువగా వచ్చే ప్రదేశాలైన రైతు బజార్, మార్కెట్, హాస్పిటల్స్, హోటల్స్ మానేజర్లతో మంగళవారం ఉదయం విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల నూతన భవనంలోని మీటింగ్ హాల్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ మాట్లాడుతూ ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణానికి హాని కలుగుతుందని అవి భూమిలో కలిసిపోవడానికి 200 సంవత్సరాలకు పైగా సమయం పడుతుందని. పర్యావరణహితమైన వస్తువులనే వాడాలని మార్కెట్ ప్రదేశాలలో రైతు బజార్లలో హాస్పిటల్లో ఎక్కడాను సింగిల్ యూజ్ ప్లాస్టిక్కు నిషేధించాలని దానికి బదులుగా పర్యావరణహితమైన వస్తువులను వాడేందుకు ప్రజలను చైతన్య పరచాలని. ఈ నెల ఆఖరు లోగా ప్రజలందరికీ వాటి గురించి అవగాహన కల్పించాలని తెలిపారు. మార్చ్ 1, 2025 నుండి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం పై ప్రత్యేక రైడ్లు నిర్వహిస్తారని, ఎవరైనా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ని వాడినచో అమ్మినచో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని భారీ జరిమానా విధిస్తారని, అమ్మేవారి ట్రేడ్ లైసెన్స్



లు క్యాన్సిల్ చేస్తారని తెలిపారు. ఈ సమావేశంలో విజయవాడ నగరపాలక సంస్థలో గల రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్లు, మార్కెట్ మేనేజర్లు, హాస్పిటల్ మేనేజర్లు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు, సానిటరీ సూపర్వైజర్లు, ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

## జోనల్ మాస్టర్ ప్లాన్ రూపొందించాలి- జిల్లా కలెక్టర్

**మచిలీపట్నం ఫిబ్రవరి 18 (వార్తాప్రభ ప్రతినిధి)**ఎకో సెన్సిటివ్ జోన్ లో పర్యావరణానికి ఎటువంటి హాని కలగకుండా భవిష్యత్తులో చేపట్టబోయే పనులకు సంబంధించి జోనల్ మాస్టర్ ప్లాన్ రూపొందించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులు ఆదేశించారు. ఎకో సెన్సిటివ్ జోన్ లో మాస్టర్ ప్లాన్ రూపొందించడం పై మంగళవారం కలక్టరేట్ ఛాంబర్ లో అటవీ, రెవెన్యూ, పర్యావరణ ,పర్యాటక, పరిశ్రమలు ,పంచాయతీరాజ్ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కృష్ణ వైల్డ్ లైఫ్ సాంక్ష్యూరి పరిధిలో ఎకో సెన్సిటివ్ జోన్ ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందన్నారు. ఎకో సెన్సిటివ్ జోన్ పరిధిలోని గ్రామాలలో పర్యావరణానికి ఎటువంటి ఆటంకం కలగకుండా భవిష్యత్తులో చేపట్టబోయే పనులు సంబంధించి ఆయా శాఖలు మాస్టర్ ప్లాన్ రూపొందించుకోవాలన్నారు. ఆయా శాఖలు అవసరాలకు అనుగుణంగా చేపట్టే అభివృద్ధి పనులకు ముందుగా పర్యావరణ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎకో సెన్సిటివ్ జోన్ లో చేపట్టకూడనవి, అనుమతించేవి, నియంత్రణ కలిగిన వాటిపై ఆయా శాఖలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



అన్నారు. సమావేశంలో డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, ఆర్డిఓ కె.స్వాతి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈ ఈ శ్రీనివాస్, జిల్లా పర్యాటకశాఖ అధికారి జి రామ లక్ష్మణరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు ఉన్నారు.

## చిన్నారి వైద్యానికి మైత్రీ చేయూత



**మచిలీపట్నం ఫిబ్రవరి 18 (వార్తాప్రభ ప్రతినిధి)** మైత్రి ఫౌండేషన్ ఒక చిన్నారి కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. వివరాల్లోకి వెళితే బందరు పట్టణం ఈడేపల్లి ప్రాంతానికి చెందిన సయ్యద్ అఫ్రీన్ ( వయసు 4 ) అనే బాలికకు గొంతుకు సంబంధించిన వ్యాధి రావడంతో డాక్టర్ సర్జరీ చేయాలని లేకపోతే శ్వాస తీసుకోవడానికి కూడా ఇబ్బంది కలుగుతుందని చెప్పారు. అసలే పేద కుటుంబం,తండ్రి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తుండగా ప్రస్తుతం చిన్నారి ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ఆటోను కూడా తాకట్టు పెట్టి ఆపరేషన్ చేయించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోకపోవటంతో సాయం కోసం మైత్రి ఫౌండేషన్ ను సంప్రదించగా సభ్యులు వెంటనే స్పందించి దాతల సహకారంతో ఆ చిన్నారి కుటుంబానికి సభ్యులు పొలగాని అశోక్ చేతుల మీదుగా ? 35,000 రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా చిన్నారి తల్లితండ్రులు,స్థానికులు మైత్రీ ఫౌండేషన్ బృందానికి ధన్యావాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం లో మైత్రి ఫౌండేషన్ అధ్యక్షులు కే వేణు కుమార్,కార్యదర్శి డి రాధాకృష్ణ ,కోశాధికారి కనకరాజు సభ్యులు వక్కంటి రమాదేవి, అబ్దుల్ మొబిన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రామకృష్ణ పరమహంస జయంతి



**మచిలీపట్నం ఫిబ్రవరి 18 (వార్తాప్రభ ప్రతినిధి)**మచిలీపట్నం మంగళవారం అజ్మీర్ బాబా సేవా సమితి ఆధ్వర్యంలో రామకృష్ణ పరమహంస జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలిత రామకృష్ణ పరమహంస చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు ఆయన జీవిత చరిత్రను గురించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రామకృష్ణ పరమహంస భారతీయ సనాతన ధర్మానికి ,సంస్కృతికి ఆచార్యులు అని అన్నారు. సర్వలోకాలను పాలించేవారు సమస్త జీవులను సంరక్షించేవారు దేవుడు, సర్వేశ్వరుడు ఒక్కడే అనే సత్యాన్ని మరువరాదని భారతీయులకు బోధించిన గురువు అని అన్నారు. విభిన్న మతాలు భగవంతుని చేరడానికి విభిన్న మార్గాలు అనే సత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన ఏకైక వ్యక్తి రామకృష్ణ పరమహంస అని అన్నారు. రామకృష్ణ పరమహంస బోధనలు అందరూ పాటించాలనీ అన్నారు. ఈ కార్యక్రమంలో నేతి పవన్ కుమార్ ,సోహెల్ హుస్సేన్, సుబ్బారావు, రవి , నాగేశ్వరరావు,బాజీ తదితరులు పాల్గొన్నారు.

## భైరవకోన పుణ్యక్షేత్రాన్ని పర్యాటక ప్రాంతంగా అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం

### శివరాత్రి ఉత్సవాల వాల్ పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి



**కనిగిరి ఫిబ్రవరి 18 వార్తా ప్రభ ప్రతినిధి** ప్రకాశం జిల్లాలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం, పర్యాటక క్షేత్రం అయినా భైరవకోనలో ప్రతి సంవత్సరము శివరాత్రి మహోత్సవము లు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. అందులో భాగంగా మంగళవారం కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి శివరాత్రి ఉత్సవాల వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీ భైరవేశ్వర స్వామి, త్రిముఖ దుర్గాదేవికి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయ అధికారులు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ను ఘనంగా సన్మానించారు. పర్యాటక ప్రాంతంగా భైరవకోనను అన్ని విధాల అభివృద్ధి చేస్తామని,శివరాత్రికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలిగించకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డి, డి.ఎస్.పి సాయి ఈశ్వర్ యశ్వంత్, ఈవో వంశీకృష్ణ, పామూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ భీమా నాయక్, పామూరు మండల టిడిపి నాయకులు యారవ శ్రీనివాసులు పాల్గొన్నారు.

## బెస్ట్ ఫిజిక్ పోటీలలో నిమ్రా విద్యార్థికి ప్రథమ బహుమతి



**ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 18(వార్తా ప్రభ ప్రతినిధి ):** -జవహర్ లాల్ టెక్నికల్ యూనివర్సిటీ కాకినాడ ఆధ్వర్యంలో సెంటెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో క్రీడా పోటీలు నిర్వహించారు. అందులో బెస్ట్ ఫిజిక్ విభాగంలో నిమ్రా ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి చిరసాని సుజిత్ ప్రథమ బహుమతి గెలుచుకున్నాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అక్బర్ ఖాన్, ఫిజికల్ డైరెక్టర్ సత్తార్ ఖాన్, షేక్ షరీఫ్, కళాశాల సిబ్బంది అభినందించారు.

# పారిశుధ్య నిర్వహణ కచ్చితంగా జరగాలి

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర ఆదేశాలు**

**మోటారు సైకిల్ పై మున్సిపల్ కమిషనర్ ధ్యాన చంద్ర సుడిగాలి పర్యటన**



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 18 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పారిశుధ్య నిర్వహణ ఖచితంగా జరగాలని, ఎక్కడ వ్యర్థాలు ఉండరాదని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం తన పర్యటనలో భాగంగా ఆంధ్రప్రభ కాలనీ, ప్రకాష్ నగర్, ఎల్బీఎస్ నగర్, ఉడా కాలనీ, కరకట్ట రోడ్, కండ్రిక, నూజివీడు రోడ్డు, వాంబే కాలనీ, తదితర ప్రాంతాలని పర్యటించి క్షేత్రస్థాయిలో పారిశుధ్య నిర్వహణ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోడ్డుపై ఎటువంటి వ్యర్థాలు ఉండరాదని, ఇంటింటి వ్యర్థల సేకరణ కచ్చితంగా జరగాలని, పుష్ కార్ట్ లలో కచ్చితంగా నాలుగు చెత్తబుట్టలను ఉంచాలని, తడి చెత్తను పొడి చెత్తను విడివిడిగా సేకరించాలని, నిర్మాణ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తీసివేయాలని, అధికారులను ఆదేశించారు. ప్రకాష్ నగర్, ఎల్బీఎస్ నగర్, ఉడా కాలనీ, పరిసర ప్రాంతాలన్నీ శానిటరీ ఇన్స్పెక్టర్ గోపిరాజు ద్విచక్ర వాహనంపై ఎక్కి పారిశుద్ధ్య నిర్వహణను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వ్యర్థాలను రోడ్డుపైన నిలువ ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని. కాలువలో పూడికలను ఎప్పటికప్పుడు తీస్తూ నీటి ప్రవాహంలో ఎటువంటి ఆటకం లేకుండా చూసుకోవాలని, నీటి ప్రవాహాన్ని ఆగినప్పుడు దోమలు ఉత్పత్తి అవుతాయని, దోమలను నియంత్రించటానికి కాలువలలో పూడికలను తీయటమే కాకుండా మలేరియా సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రతిరోజు ఫాగింగ్, యం ఎల్ ఆయిల్ స్ప్రే చేస్తూ, ప్రజలు దోమ కాటు వల్ల అనారోగ్యం పాలవకుండా చూసుకునేటట్టు చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఇంచార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, బయాలజిస్ట్ సూర్యకుమార్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, శానిటరీ ఇన్స్పెక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

## డయాలసిస్ సెంటర్ ఆధునీకరణ కోసం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రకు విరాళం అందజేత




**కనిగిరి ఫిబ్రవరి 18 వార్తా ప్రభ ప్రతినిధి** కనిగిరి నియోజకవర్గం కనిగిరి పట్టణంలోని అమరావతి గ్రౌండ్స్ లో మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రిలో డయాసి సెంటర్ ఆధునీకరణ కోసం షేక్ అబ్దుల్ ఖాదర్ 50 వేల రూపాయల విరాళాన్ని శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ ఫ్లోరిడ్ మహమ్మారిని తరిమి వేయుటకు దాతల సహకారం అభినందనీయమని, కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. 50 వేల రూపాయలు విరాళాన్ని అందజేసిన షేక్ అబ్దుల్ ఖాదర్ కు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అభినందించారు.

## మార్చిలో జనసేన వర్సెస్ వైసీపీ

**విజయవాడ, ఫిబ్రవరి 18 వార్తా ప్రభ ప్రతినిధి :** మార్చి సమీపిస్తోంది.. మరో 10 రోజుల వ్యవధి మాత్రమే ఉంది. మార్చి 12న వైసీపీ ఆవిర్భావ దినోత్సవం జరగనుంది. అదే సమయంలో జనసేన ప్లీనరీ సైతం జరగనుంది. దీంతో అంతటా పొలిటికల్ హీట్ ఉంటుంది ఈ నెలలో. ఇప్పుడిప్పుడే వేసవి ప్రారంభమైంది. రాజకీయ వేడి కూడా ఉంది. ఇటువంటి తరుణంలో రెండు పార్టీలకు సంబంధించి కీలక కార్యక్రమాలు మార్చిలోనే ఉండడం విశేషం. దీంతో పోటా పూర్తిగా ప్రకటనలు ఉండనున్నాయి. అదే సమయంలో రాజకీయ విమర్శలు, వ్యూహాలు సైతం కొనసాగనున్నాయి. దీంతో మార్చిలో పొలిటికల్ హైట్ అండ్ సన్ వాతావరణం క్రియేట్ అయ్యే పరిస్థితి కనిపిస్తోంది. అధికార, విపక్షాలకు సంబంధించి ఒకే రోజు కార్యక్రమాల నిర్వహణ ఉండడంతో తప్పకుండా రాజకీయ అంశాలు, సంచలనాలు ఉండనున్నాయి. జనసేన ప్లీనరీని మార్చి 12 నుంచి మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ నిర్ణయించింది. పిఠాపురంలో ప్లీనరీ నిర్వహిస్తుండడంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడంతో ఏర్పాట్లు ఘనంగా చేస్తున్నారు. లక్షలాదిమంది తరలి వస్తారని అంచనా వేస్తున్నారు. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత జనసేనకు ఈ ఎన్నికల్లో మంచి విజయం దక్కింది. కూటమి ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉంది జనసేన. అందుకే ఈ ప్లీనరీ జనసేనకు ప్రత్యేకం. ఇదే వేదికగా జనసేన సంచలన నిర్ణయాలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది. అటు రాజకీయంగా కొన్ని రకాల నిర్ణయాలు ప్రకటించే అవకాశం ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. అయితే ఇదివరకు ఎన్నడూ లేని గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది వైయస్సార్ కాంగ్రెస్పార్టీ. 2012 మార్చి 12న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించింది. పుష్కర కాలం దాటి 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంటుంది ఆ పార్టీ. అయితే తొలి ఆరేళ్లు బలమైన ప్రతిపక్షంగా ఉంది వైయస్సార్ కాంగ్రెస్. గత ఐదు సంవత్సరాలుగా అధికారపక్షంగా ఉండేది. అయితే ఈ ఎన్నికల్లో ఘోర పరాజయంతో ఆ పార్టీ పరిస్థితి మారింది. ఇప్పటివరకు ఒక లెక్క.. మొన్నటి ఎన్నికల తర్వాత మరో లెక్క అన్నట్టు ఉంది ఆ పార్టీ పరిస్థితి. చావో రేవో తేల్చుకోవాల్సిన సమయం ఇది. అందుకే అధినేత జగన్మోహన్ రెడ్డి దూకుడుగా అడుగులు వేస్తున్నారు. ఈ ఆవిర్భావ దినోత్సవం నాడు ఆయన కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ఉగాది నుంచి ప్రజల్లోకి వెళ్లాలని భావిస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. అదే సమయంలో పార్టీకి చెందిన కీలక నేతలు రాజీనామాలు ప్రకటిస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీలోని సీనియర్లతో పాటు తటస్థ నేతలు వైసిపి వైపు వస్తున్నారు. ఈ క్రమంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం నాడు కీలక నిర్ణయాలు వెల్లడిస్తారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇంకోవైపు కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న జనసేన సైతం.. ప్లీనరీ వేదికగా సంచలన ప్రకటనలు చేసే పరిస్థితి ఉంది. దీంతో సర్వత్రా దీనిపై ఉత్కంఠ కొనసాగుతోంది. మార్చిలో పొలిటికల్ హీట్ కొనసాగే పరిస్థితి ఉంది.

## నాన్నమ్మ సూక్తులు

సున్నితమైన మనసులు
చేయకూడదు ముక్కలు
బాకులాంటి మాటలతో
విపరీతపు చేష్టలతో
దేవుని సృష్టి సర్వము
చేయరాదోయ్! నాశనము
చేతనైతే అందరికి
అందించాలోయ్! సాయము
చూడాలోయ్! అందరిలో
దేవ దేవుని రూపము
వీడాలోయ్ మనసుల్లో
ఉన్న చెత్తాచెదారము
శృతిమించితే గర్వము
కట్టలు తెగిన కోపము




చేయును అల్లకల్లోలము
మసి బారునోయ్! జీవితము

**-గద్వాల సోమన్న**
,ఎమ్మిగనూరు

## పాతబస్తీలో షాపుల యజమానులూ.. మీ షాపుల ఎదురుగా కార్పొరేటర్ కారులొస్తాయి

● బహుపరాక్ రాజోస్తున్నారోయ్ ఏ కట్టడమైనా అడ్డు తొలిగించండోయ్ ● ఇది కార్పొరేటర్ హర్షద్, కార్పొరేషన్ సీ.ఎం.హెచ్. ఓ. తీరు ● సి ఎం హెచ్ ఓ లు సైతం కార్పొరేటర్ చేతుల్లో కీలు బొమ్మాలే....... ● సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 18 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పాతబస్తీ పరిధిలో పార్క్ రోడ్డు లో సోమవారం 54వ డివిజన్ కార్పొరేటర్ హర్షత్ తన కారుని సామారంగం చౌక్ లో ఒక షాపు ముందు పార్కింగ్ చేస్తున్న సందర్భంలో, సదరు షాపు వారు వచ్చి షాపుకు అడ్డంగా ఉన్నదని కొద్దిగా పక్కన పెట్టుకోండి అని అన్నందుకు, రెచ్చిపోయిన కార్పొరేటర్ నియంత పోకడలు విస్మయాన్ని కలిగించిన తీరుపై సీపీఐ నాయకులు జి కోటేశ్వరరావు ఘాటుగా విమర్శించారు. మంగళవారం తేదీన ఉదయం షాపు ముందు ఉన్న మెట్లను సీఎం హెచ్ ఓ కు చెప్పి, కక్ష సాధింపు చర్యగా కొట్టించడం అత్యంత దారుణం. అంటే సి ఎమ్ హెచ్ ఓ లు సైతం కార్పొరేటర్ చేతిలో కీలు బొమ్మలేనా..కార్పొరేటర్ అనేవాడు ఏం చెప్పినా ముందు వెనక ఆలోచన లేకుండా తూ చా తప్పకుండా చేస్తామనే ధోరణిలో వారున్నారనేది ఈ సంఘటన స్పష్టం చేస్తోందని కోటేశ్వరరావు ఆవేదన వ్యక్తంచేశారు. కార్పొరేటర్ హర్షత్ కు ఈ డివిజన్ కి ఎటువంటి సంబంధం లేకపోయినా, స్థానిక కార్పొరేటర్ కు కనీసం సమాచారం తెలియకుండానేఈ దుశ్చర్యకు ఒడికట్టటం చూస్తే, సీ.ఎం హెచ్. ఓ, కార్పొరేటర్ తీరులను పరిశీలిస్తే శోచనీయంగా ఉందని తెలిపారు. రాచరిక పాలనలో రాజు వస్తుంటే ప్రజలు వైదొలగటానికి, బహుపరాక్ రాజోస్తున్నారోయ్ తొలగండోయ్ అంటూ ప్రచారకులు ముందు అరుస్తున్న చందంగా కార్పొరేషన్ అధికారుల తీరుని సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. మనం ప్రజాస్వామ్య వ్యవస్థ లో ఉన్నామా ..? లేదా ..? అనే సందేహం కలుగుతుందన్నారు. ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా, అప్రజాస్వామికంగా, భయానక పద్ధతిలో ఇటువంటి చర్యలు చేపట్టిన సీఎంహెచ్ఓ తీరుపై మున్సిపల్ శాఖ మంత్రి జోక్యం చేసుకోవాలని, వాస్తవ పరిస్థితులను పరిశీలించి, కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మున్సిపల్ కమిషనర్, అధికారులు పై ఉందని, షాపు యజమానులంతా ఐక్యంగా ఉండాలని సూచించారు. బాధితులకు భారత కమ్యూనిస్టు పార్టీ, సిపిఐ అండగా ఉంటదని హామీనిచ్చారు.

## ఆలపాటి రాజా గెలుపు తథ్యం- దామచర్ల సత్య





**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 18 (వార్తా ప్రభ ప్రతినిధి)** మొహమ్మద్ ఫతావుల్లా కార్యాలయం వద్ద పార్లమెంట్ సభ్యులు కేశినేని చిన్నీ సూచన మేరకు ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలోజరిగిన కూటమి నాయకుల సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జ్ దామచర్ల సత్య మరియు కొనకళ్ళ బుల్లయ్య లు పాల్గొన్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఫతావుల్లా అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథి దామచర్ల సత్య మాట్లాడుతూ ఆలపాటి రాజా విద్యావంతులు మూడుసార్లు ఎమ్మెల్యేగా చేసిన వ్యక్తి ఒకసారి మంత్రిగా చేసిన వ్యక్తి అపార అనుభవం కలిగిన ఆలపాటి రాజా ని గెలిపించుకుంటే మన సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కూటమి నాయకులు ఈ పది రోజులు బాగా కష్టపడి పనిచేస్తే మెజారిటీ సాధించడం పెద్ద పని కాదన్నారు .ఓటర్ వెరిఫికేషన్ దశ అయిపోయింది కాబట్టి ప్రతి ఒక్క ఓటర్కి ఒకటికి రెండు సార్లు కలిసి ఆలపాటి రాజేంద్ర గెలవాల్సిన అవసరాన్ని తెలుపవలసిందిగా కోరారు. అలాగే మరో అతిథి కొనకళ్ళ బుల్లయ్య మాట్లాడుతూ ఆలపాటి రాజా తెలుగుదేశం బిజెపి జనసేన అధిష్టానానికి ఇష్టుడని ఇటువంటి నాయకుడు గెలిస్తే కౌన్సిల్లో మన సమస్యలను లేవనెత్తి పరిష్కరిస్తారని తెలుగుదేశం బిజెపి జనసేన ప్రతి కార్యకర్త తన కర్తవ్యం గా భావించి ఓటర్లను కలవాలని అలాగే పోలింగ్ రోజు కూడా ఓటర్లను పోలింగ్ బూతుల వద్దకు తీసుకొని వచ్చే ప్రక్రియను సజావుగా నడిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్, కార్పొరేటర్లు అప్పాజీ, ఉమ్మడి చంటి, బుల్ల విజయ్ కుమార్, గుడివాడ నరేంద్ర, తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు షేక్ ఆషా, సోలంకి రాజు,రాజేష్, యేదుపాటి రామయ్య, కొట్టేటి హనుమంతరావు, దీటి ప్రభు దాస్,రాజ్యలక్ష్మి, బోగవల్లి శ్రీధర్, బొడ్డు నాగ లక్ష్మి,తదితర నాయకులు పాల్గొని ప్రసంగించారు.

## ఓపెన్ స్కూల్ పరీక్షలు పటిష్టంగా నిర్వహించాలి - బీసీ ఎస్ ఎఫ్

**ఏ వన్ కోఆర్డినేటర్ సెంటర్ నిర్వాహకుల అవకతవకులను అరికట్టాలి**



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 18(వార్తా ప్రభ ప్రతినిధి)**ఓపెన్ స్కూల్ పరీక్షలను పటిష్టంగా నిర్వహించాలని ఏ వన్ కోఆర్డినేటర్ సెంటర్ నిర్వాహకుల అవకతవకలను అరికట్టాలని కోరుతూ బీసీ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె హరీష్ కుమార్ మంగళవారం స్థానిక డిస్టిక్ ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ కార్యాలయంలో జిల్లా కోఆర్డినేటర్ వెంకటప్పయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ పరిధిలో రానున్న రోజుల్లో జరగనున్న ఓపెన్ స్కూల్ ఓపెన్ టెన్త్ పరీక్షలను పటిష్టంగా నిర్వహించాలని బీసీ ఎస్ఎఫ్ కోరుతుందన్నారు. ఇప్పటికే ఓపెన్ స్కూల్స్ ఏ వన్ కోఆర్డినేటర్ గా నిర్వహిస్తున్న పలు సంస్థలు విద్యార్థుల దగ్గర భారీ మొత్తంలో సొమ్మును కాజేస్తున్నారని మా దృష్టికి వచ్చి ఉన్నది. ఈ విషయమై జిల్లా కోఆర్డినేటర్ వెంకటప్పయ్యను కలిసి విషయాన్ని వివరించారు. అడ్మిషన్ ఫీజు కింద రెండు వేల రూపాయలు,రిజిస్ట్రేషన్ ఫీజు కింద రెండు వేల రూపాయలు. ఎగ్జామ్ మేనేజ్మెంట్ ఫీజు కింద ఐదు వేల రూపాయలు,ఇన్విజిలేటర్ మేనేజ్మెంట్ పీజు కింద వెయ్యి రూపాయలు,ఇలా అనేక రకాలుగా ఓపెన్ స్కూల్లో అడ్మిషన్ తీసుకున్నటువంటి విద్యార్థుల దగ్గర వేల రూపాయలు దోచేస్తున్నటువంటి ఈ యొక్క ఓపెన్ స్కూల్ సంస్థలపై సమగ్ర విచారణ జరిపి ఆయా సంస్థల పైన కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. నిర్వాహకులు విద్యార్థులకు చెప్పేటువంటి మాటలు ఎలా ఉన్నాయంటే మీరు డబ్బులు ఇవ్వండి చాలు మీకు టెన్త్ సర్టిఫికెట్ ఇచ్చే బాధ్యత మాది అని చెప్పి విద్యార్థుల జేబులను ఖాళీ చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ ఎస్ ఎఫ్ నాయకులు నవీన్,శ్రీనివాసరావు, నాని తదితరులు పాల్గొన్నారు.



## "ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి"

**పెనుకొండ: ఫిబ్రవరి 18 (వార్తాప్రభ ప్రతినిధి)**ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాలకు ట్రాన్స్ పోర్టు రంగం జిల్లా ప్రధాన కార్యదర్శి బాబా డిమాండ్ చేశారు. మంగళవారం పెనుకొండలో ఆటో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ట్రాన్స్ పోర్టు రంగంను ప్రభుత్వాలు ప్రైవేటు ఏజెన్సీలకు అప్పజెప్పడం సరైంది కాదని ఈ విధానాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

## అంగన్వాడీ టీచర్లకు శిక్షణా తరగతులు



**చేజర్ల ఫిబ్రవరి 18 (వార్తాప్రభ)** మండలంలోని అంగన్వాడీ టీచర్లకు మూడు రోజుల పాటు జరిగే జ్ఞాన జ్యోతి మండల స్థాయి శిక్షణా తరగతులను చేజర్ల ఉన్నత పాఠశాల యందు మంగళవారం ఉదయం 9 గంటలకు మండల ద్వితీయ విద్యాశాఖాధికారి డిసి మస్తానయ్య జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ మూడు నుంచి ఐదు సంవత్సరాల పిల్లలలో మానసిక శారీరిక అభివృద్ధిని పెంపొందించుటకు వివిధ కృత్యాల ద్వారా ఆట పాటలతో ఎలా బోధించాలో ఈ శిక్షణలో రిసోర్స్ పర్సన్స్ తెలియజేస్తారని ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని అంగన్వాడి టీచర్లను కోరారు. ఈ కార్యక్రమంలో మండల చేజర్ల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు పి.హైమావతి ఐ.సి.డి.ఎస్ సూపర్వైజర్ సి.హెచ్ సురేఖ మండల రిసోర్స్ పర్సన్లు సుబ్రహ్మణ్యం బి.వెంకటేశ్వర్లు జె.సుధాకర్ మరియు మండలంలోని అందరూ అంగన్వాడి టీచర్లు పాల్గొనడం జరిగింది.

## స్వచ్ఛ సర్వేక్షన్ లో అందరూ పాల్గొనండి

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 18 :(వార్తా ప్రభ ప్రతినిధి)** స్వచ్ఛ సర్వేక్షన్ లో ప్రజలందరినీ పాల్గొనమని పిలుపునిచ్చారు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర. మంగళవారం సాయంత్రం కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా విజయవాడ నగరపాలక సంస్థకు స్వచ్ఛ సర్వేక్షన్ లో ఉత్తమమైన స్థానాలు వచ్చాయని, దీనికి కారణమైన ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ ఈ సారి జరిగే స్వచ్ఛ సర్వేక్షన్లో కూడా పాల్గొని విజయవాడ ను ఉత్తమమైన స్థానంలో నిలపాలని ప్రజలను కోరారు. ఈసారి నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షన్ ఫీడబాక్ ను క్యూ ఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేసి, ఫోన్ నెంబర్, ఓ టి పి నమోదు చేసి, సర్వేలో ఉన్న పది ప్రశ్నలకు తమ అభిప్రాయాన్ని తెలియపరచి సర్వేని పూర్తి చేయవలసిందిగా ప్రజలను విన్నవించారు.

## రేపు ఇబ్రహీంపట్నంలో యూత్ ఉత్సవ్

**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 18 (వార్తా ప్రభ ప్రతినిధి):–** ఫిలదెల్ఫియా ఏజీ చర్చి అండ్ కృపానిధి ఏజీ చర్చి సంయుక్త ఆధ్వర్యంలో యవనస్థులకు యూత్ ఉత్సవ్ నిర్వహిస్తున్నట్లు వర్తమానికులు రెవరెండ్ ఛార్ల్స్ పి.జాకబ్, డాక్టర్ ఫిలిప్ పి.జాకబ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇబ్రహీంపట్నంలోని ఏ కాలనీ ఎన్టీటీపీఎస్ గ్రౌండ్ లో ఈ నెల 20వ తేదీ సాయంత్రం 6:30 గంటలకు ఈ యూత్ ఉత్సవ్ ప్రారంభమవుతుందన్నారు. ఇందులో విద్యార్థిని విద్యార్థుల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నట్లు చెప్పారు. యూత్ ఉత్సవ్ కు యవనస్థులు వేలాదిగా హాజరై దేవునిని ఆరాధించి ఆత్మీయ మేలులు పొందాలని కోరారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 18 (వార్తా ప్రభ ప్రతినిధి):–** రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కొండపల్లి మున్సిపల్ కమిషనర్ బి.రమ్య కీర్తనకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల వేతనాల చెల్లింపు, పనుల అప్పగింత, నిర్వహణ, సాంఘిక భద్రత పూర్తి బాధ్యతలు మున్సిపల్ శాఖకే ఉండాలన్నారు. ప్రైవేట్ కంపెనీ, ఏజెన్సీలకు అప్పజెప్పకుండా అవుట్ సోర్సింగ్, పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. పర్మినెంట్ కార్మికులకు గత మూడు సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న సరెండర్ లీవ్ లో ఎన్కాష్మెంట్, మూడు డీఏ లు సత్వరం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత సమ్మెలో ఇంజనీరింగ్ కార్మికుల వేతనాల పెంపునకు జరిగిన అగ్రిమెంట్ మేరకు వేతనాలు పెంచాలని, జనాభా ప్రాతిపదికన కార్మికులను పెంచాలని విజ్ఞప్తి చేశారు. మరణించిన, రిటైర్డ్ అయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అవకాశం ఇవ్వాలని కోరారు. కమిషనర్ రమ్య కీర్తన స్పందిస్తూ పెండింగ్ లో ఉన్న రెండు నెలల వేతనాలను మార్చి ఒకటో తేదీ చెల్లిస్తామని చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుబ్బారావు, నరసింహారావు, తిరుపతిరావు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# రివిజనిస్ట్ పార్టీల విధానాలను ప్రతిఘటించండి

**సూర్యం గౌని ఐలయ్య విమర్శలను తిప్పి కొట్టండి**
**సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ తొర్రూర్ డివిజన్**
**కార్యదర్శి ఆలకుంట్ల సాయన్న పిలుపు**



**తొర్రూర్ ఫిబ్రవరి 18(వార్తా ప్రభ)** భారతదేశంలో నూతన ప్రజాస్వామ్య విప్లవం వర్ధిల్లాలంటూ మార్క్సిజం లేని నిజం మావో ఆలోచనల విధానాన్ని ముందుకు తీసుకుపోవాలని లక్ష్యంతో సిపి ఐఎంఎల్ న్యూ డెమోక్రసీ పనిచేస్తుందని తొర్రూర్ డివిజన్ కార్యదర్శి ఆలకుంట్ల సాయన్న అన్నారు. మంగళవారం తొర్రూర్ లో పత్రిక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, 1968 సిపిఎం నుండి విప్లవకారులు విడిపోయిన నాటి నుండి రివిజనిస్టులకు వ్యతిరేకంగా పోరాడుతూ ఆదివాసులు తమ త్యాగాలతో తమ నెత్తుటి దారులతో నిర్మించిన ఉద్యమం కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి నుండి ఈ ప్రాంత ఉద్యమం ఎరిపెక్కిందని ఆయన తెలిపారు. ఆనాటి ఉద్యమ కెరటాలు కామ్రేడ్ పాలడుగు,కృష్ణ కామ్రేడ్ జానకి రామ్ రెడ్డి అలియాస్ మంగన్న కామ్రేడ్ నారాయణ (కర్నూలు )విద్యార్థి ధ్రువతార శ్రీపాద శ్రీహరి దొరన్న ఎల్లన్న బేబక్క బూర్క పెద్ద వెంకటయ్య గొగ్గల్ల లక్ష్మయ్య ముస్మి అమరులు మురళి గణేష్ సుజాత కుమార్ వెంకన్న పెనక వెంకన్న చీరాల లాంటి అనేకమంది అమరులు నిర్మించిన విప్లవద్యమం అన్నారు. వీరంతా ఫాసిస్టు నిర్బంధాన్ని ఎదురించి తమ ప్రాణాలు వద్దారని,రివిజనిస్ట్ విధానానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని నిర్మించి వేలాది ఎకరాల పోడు భూములను ఆదివాసిలకు పంచి పెట్టారన్నారు. సిపి రిపొందించిన గోదావరి లోయ ప్రతిఘటన రాజకీయాలకు వన్నె తెచ్చి విప్లవ కేంద్రంగా పాకాల కొత్తగూడం సెంటర్లో , హైదరాబాదు నగరంలో,ఆఫీసును నిర్మాణానికి పూడుపోసుకున్నది ఈనాడు పాకాల కొత్తగూడం పార్టీ కార్యాలన్నీ తమ ఆఫీసు అని, సూర్యం గౌని ఐలయ్య , హైదరాబాదులో ఉన్న ఆఫీసును గోవర్ధన్ ఎం శ్రీనివాస్ మాదని చెప్పుకోవడం సిగ్గుచేటు విషయమని, సాయన్న పేర్కొన్నారు. గత కొంతకాలంగా, సిపి ఐఎంఎల్ న్యూడెమోక్రసీ సిద్ధాంతాలకు త్రిలోదకాలు ఇచ్చి, మార్క్సిజం లేని నిజానికి, వ్యతిరేకంగా పనిచేస్తున్న రివిజనిస్ట్ నాయకుల విధానాలను ప్రజలు ప్రతిఘటించాలని ఆయన పిలుపునిచ్చారు. కొంతమంది స్వార్థపరులు స్వలాభం కోసం కమ్యూనిస్టు సిద్ధాంతాలను తుంగలో తొక్కి వ్యక్తిగత అవసరాల కోసం పనిచేస్తూ, ఆదివాసీల హక్కులను ఆదివాసులపై జరుగుతున్న నిర్బంధాన్ని అక్రమ కేసులను వ్యతిరేకించకుండా, ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పై తప్పుడు విమర్శలు చేస్తున్న రివిజనిస్ట్ పార్టీలకు, ప్రజలు బుద్ధి చెప్పాలని ఆయన తెలిపారు. భారతదేశంలో నూతన ప్రజాస్వామ్య విప్లవం, మూలంగానే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేకూరునని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. కావున ప్రజలు విద్యార్థుల మేధావులు ప్రజాస్వామ్యక వాదులు నూతన ప్రజాస్వామ్య విప్లవం వైపు, రావాలని ఆయన పిలుపునిచ్చారు.

# దర్జాగా కబ్జా

**● అధికార పార్టీ ముసుగులో జూపూడి సర్పంచ్ నిర్వాకం ● కొండను పొక్లెయిన్ తవ్వి ఆక్రమణ ● దారిని సైతం ఆక్రమించారని స్థానికుల ఆవేదన ● తహసీల్దార్ కు కిలేశపురం గ్రామస్థుల ఫిర్యాదు**





**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 18 (వార్తా ప్రభ ప్రతినిధి):–** ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవకుండా చూడాల్సిన ప్రజాప్రతినిధే దర్జాగా ఆక్రమించారు. కాలనీ ప్రజల కోసం కేటాయించిన ఏడు అడుగుల దారిని సైతం ఆక్రమించి, పక్కనే ఉన్న కొండను చదును చేసి అక్రమ నిర్మాణం చేపడుతున్నారు. దీనిపై కాలనీ వాసులు ప్రశ్నిస్తే తనకు అధికార పార్టీ అండదండలు ఉన్నాయని, ఎవరూ ఏం చేయలేరని దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. జూపూడి గ్రామ పరిధిలోని కిలేశపురం జగనన్న కాలనీలో జూపూడి సర్పంచ్ కాకి దేవమాత చేస్తున్న ఆక్రమణ, అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలని కొంతమంది గ్రామస్థులు తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు సోమవారం ఫిర్యాదు చేశారు. వివరాల ప్రకారం గత ప్రభుత్వం జూపూడి సర్పంచ్ కాకి దేవమాతకు కొండపల్లి (ఈలప్రోలు) జగనన్న కాలనీలో ప్లాట్ కేటాయించింది. అయితే ఆ ప్లాట్ ను రద్దు చేయించుకుని, కిలేశపురంలో ప్లాట్ తీసుకున్నట్లు చెబుతున్నారని జగనన్న కాలనీ ప్రజలు అంటున్నారు. ఆమె తల్లి రెంటపల్లి కుమారి పేరుతో పట్టా ఉందని నమ్మబలుకుతూ పొక్లెయిన్ తో కొండను చదును చేసి అక్రమ నిర్మాణానికి రాత్రికి రాత్రే పునాదులు తవ్వించినట్లు ఆరోపిస్తున్నారు. నిర్మాణం చేయొద్దని కాలనీ ప్రజలు అభ్యంతరం తెలిపితే లెక్కచేయకుండా ఏడు అడుగుల దారిని సైతం మూసివేసి ప్రజలు నడవడానికి వీలు లేకుండా దురాక్రమణ చేసినట్లు చెబుతున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాన్ని నిలిపివేసి, నడవడానికి దారి ఇప్పించాలని కాలనీ ప్రజలు తహసీల్దార్ కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

## విచారించి చర్యలు తీసుకుంటాం

జూపూడి సర్పంచ్ కాకి దేవమాత ఆక్రమణ, అక్రమ నిర్మాణంపై కొంతమంది గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. మా సిబ్బందిని పంపి నిర్మాణాన్ని నిలినివేయించాం. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.

**వై.వెంకటేశ్వర్లు, ఇబ్రహీంపట్నం తహసీల్దార్**

# ఇబ్రహీంపట్నంలో ఘనంగా ఏపీఎంపీఏ రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ యాదవ్ జన్మదిన వేడుకలు



**ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 18(వార్తా ప్రభ ప్రతినిధి):–** ఏపీఎంపీఏ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్ జన్మదిన వేడుకలు ఇబ్రహీంపట్నం లో యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.కేక్ కట్ చేసి తమ నాయకుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గత 30 సంవత్సరాలుగా సీనియర్ పాత్రికేయులుగా, పత్రిక అధినేతగా, జర్నలిస్టుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న ఆయన నేటి తరం జర్నలిస్టులకు ఆదర్శంనీయమని కొనియాడారు.ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంపిఏ జిల్లా ఉపాధ్యక్షులు, ఇబ్రహీంపట్నం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు హఫీజ్ ఖాద్రీ, ఏపీఎంపీఏ మైలవరం నియోజకవర్గ కార్యదర్శి రాచబంటి క్రాంతి కుమార్, కార్యనిర్వాహ కార్యదర్శి షేక్ ఆరిఫ్, ఉపాధ్యక్షులు రవీంద్ర, రాంబాబు, సభ్యులు షేక్ రహీం, స్థానిక జర్నలిస్టులు పాల్గొన్నారు.

# శివరాత్రి రోజున తప్పకుండా వెళ్లాల్సిన శివాలయాలు ఇవే..! మిస్సవ్వకండి..!



మహాశివరాత్రి సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని శివాలయాల్లో భక్తుల రద్దీ భారీగా ఉంటుంది. ముఖ్యంగా శ్రీశైలం, శ్రీకాళహస్తి, ద్రాక్షారామం, క్షీరారామం, భీమేశ్వర ఆలయం వంటి ప్రముఖ క్షేత్రాలలో లక్షల మంది భక్తులు శివుని ఆశీర్వాదం కోసం విచ్చేస్తారు. ఈ రోజున రాత్రి జాగరణ, విశేష పూజలు, అభిషేకాలు ప్రత్యేకంగా నిర్వహిస్తారు.శివరాత్రి రోజున భక్తులు శివలింగం అభిషేకం, రుద్రపారాయణం, ప్రదక్షిణలు చేస్తూ శివుని కృప పొందాలని ఆకాంక్షిస్తారు. మహాశివరాత్రి రోజు ఈ పవిత్ర క్షేత్రాల్లో శివుని దర్శనం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని, శాంతిని అందిస్తుందని నమ్మకం. మనం కొన్ని ప్రసిద్ధ శివాలయాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి శివాలయం ప్రత్యేకమైన శైవ క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయానికి వాయులింగ క్షేత్రం అనే పేరుంది. ఇక్కడ శివుడు వాయు రూపంలో పూజలందుకుంటాడు. భక్తులు ఇక్కడ నిత్యం ప్రత్యేక పూజలు నిర్వహించి, శాంతి, శక్తిని పొందుతారని నమ్ముతారు. ఆలయ శిల్పాలు, ఆహ్లాదకరమైన వాతావరణం, పర్యాటకులకు అద్భుతమైన అనుభవాన్ని ఇస్తుంది.నల్లమల కొండలలో కొలువై ఉన్న శ్రీశైలం ఆలయం భారతదేశంలోని 12 జ్యోతిర్లింగాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. మల్లికార్జున స్వామి ఇక్కడ పూజలను స్వీకరిస్తాడు. ఈ క్షేత్రం భక్తులకు ధ్యానం, ఆధ్యాత్మికత, ప్రకృతి అందాల మేళవింపు. ఇక్కడ అమ్మవారు భ్రమరాంబిక దేవిగా పూజలు అందుకుంటున్నారు. పర్వతాల మధ్య, కృష్ణా నది ఒడ్డున ఉన్న ఈ ఆలయం ప్రతి యాత్రికుడికి శాంతిని కలిగిస్తుంది.తూర్పు గోదావరి జిల్లాలో ఉన్న ద్రాక్షారామం శైవ క్షేత్రాలలో ప్రముఖమైనది. ఇది పంచారామ క్షేత్రాలలో ఒకటి. హిందూ పురాణాలలో గొప్ప స్థానాన్ని కలిగిన ఆలయం ఇది. చాళుక్యుల, చోళుల శిల్ప కళను ఇక్కడ చూడవచ్చు. పురాణ కథల ప్రకారం శివుడు స్వయంభూతగా వెలిశాడు అని నమ్మకం.నంద్యాల జిల్లాలో ఉన్న మహానంది ఆలయం ఒక ప్రత్యేకమైన శైవ క్షేత్రం. ఈ ఆలయం చుట్టూ తొమ్మిది నందులు శివుడిని చుట్టుముట్టి ఉంటాయి. ఈ పంచభూత క్షేత్రం ప్రకృతి వైభోగానికి, విశిష్టమైన నీటి వనరులకు ప్రసిద్ధి. భక్తులు ఈ ప్రాంతాన్ని పవిత్రంగా భావించి దర్శనం చేసుకుంటారు.అమరావతిలోని అమరేశ్వరాలయం కూడా పంచారామ క్షేత్రాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయం కృష్ణా నది ఒడ్డున ఉన్నప్పుడు, శివుడు పాలరాతి రూపంలో దర్శనమిస్తాడు. ఇది అనేక భక్తులకు శాంతి, మానసిక ప్రాధాన్యత కలిగించే క్షేత్రంగా నిలుస్తుంది.పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో ఉన్న క్షీరారామ ఆలయం పంచారామ క్షేత్రాలలో ఒకటి. ఈ ఆలయ గోపురం గణనీయమైన ఎత్తుతో ఆకర్షణీయంగా ఉంటుంది. ఇది శైవ భక్తులకు, చారిత్రాత్మక ప్రాధాన్యత ఉన్న ప్రదేశంఅనంతపురం జిల్లాలోని తాడిపత్రి రామలింగేశ్వరాలయం శిల్ప కళ కోసం ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయ శిల్పాలు పురాణ కథలను అద్భుతంగా ప్రతిబింబిస్తాయి. ఈ ఆలయం ఒక ప్రత్యేకమైన నిర్మాణ శైలిని కలిగి ఉంది.పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని సోమారామ ఆలయం పంచారామ క్షేత్రాలలో ఒకటి. ఇక్కడి శివలింగం పౌర్ణమి సమయంలో రంగు మారుతుందని భక్తులు నమ్ముతారు. ఈ విశేషం భక్తులను ఆకర్షిస్తుంది.నంద్యాల జిల్లా యాగంటిలో ఉన్న ఉమా మహేశ్వర ఆలయం ప్రకృతి ప్రియులకు, భక్తులకు అద్భుతమైన ప్రదేశంగా ఉంటుంది. ఇక్కడి నంది విగ్రహం చాలా ప్రసిద్ధి చెందింది.ఈ శివాలయాలు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ శైవ క్షేత్రాలలో చిహ్నంగా నిలుస్తాయి. మహాశివరాత్రి సందర్భంగా ఈ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, ఉత్సవాలు నిర్వహించబడతాయి. భక్తులు ఈ శివాలయాల దర్శనంతో శివుడి ఆశీర్వాదాలు పొందుతూ ఆధ్యాత్మిక శాంతిని పొందుతారు.

# ఛత్రపతి శివాజీ



హైందవ స్వరాజ్య స్థాపన, అణగారిపోయిన హిందూ జాతిని జాగృతం చేసిన ఛత్రపతి శివాజీ పూణే జిల్లాలోని జున్నార్ పట్టణం దగ్గర శివనేరి కోటలో షాహాజీ, జిజియాబాయి దంపతులకు 1630,ఫిబ్రవరి 19వ తేదీన(వైశాఖ మాసం శుక్ల పక్ష తదియ నాడు)జన్మించాడు.వీరు మహారాష్ట్రలోని వ్యవసాయం చేసుకునే భోస్లే కులానికి చెందినవారు.జిజియా బాయి పూజించే దేవత పేరు కలిసేలా 'శివాజీ' అని పెట్టింది.షాహాజీ నిజాంలను ఓడించి గెలుచుకున్న ప్రాంతాల్లో సామ్రాజ్యాన్ని నెలకొల్పడానికి ప్రయత్నిస్తుండగా, మొఘలులు ఆదిల్షాతో కలసి షాహాజీని ఓడించారు.ఆదిల్షాతో సంధి ప్రకారం షాహాజి ప్రస్తుత బెంగుళూరు ప్రాంతాన్ని జాగీరుగా పొంది,పూణే వదిలి వెళ్ళవలసి వచ్చింది.షాహాజీ పూణేలో తనకున్న జాగీరును వదులుకోవలసిన అవసరం లేకుండా ఒప్పందం కుదుర్చుకొన్నాడు.షాహాజీ పూణేలో తన జాగీరు వ్యవహారాలను తన భార్యకు అప్పగించి, యువకుడయిన శివాజీకి రాజనీతి వ్యవహారాలు నేర్పడానికి కొందరు ముఖ్య అనుచరులతో కలసి ఒక విభాగాన్ని ఏర్పాటు చేసి తాను బెంగుళూరు జాగీరుకు వెళ్ళాడు.శివాజీ తల్లి అతనికి పుట్టిన భూమి పైనా,ప్రజల పైనా ప్రేమ కలుగునట్లు విద్యాబుద్ధులు నేర్పింది.చిన్ననాటి నుండీ భారత, రామాయణ,బలి చక్రవర్తి గాథలు చెప్పి వీర లక్షణాలు మొలకింప చేసింది.పరమత సహనం,స్త్రీల పట్ల గౌరవం తన తల్లివద్దనే నేర్చుకున్నాడు.తన తండ్రి పొందిన పరాజయాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి,గురువైన సమర్థ రామదాసు ప్రతినిధిగా అనతి కాలంలో శివాజీ యుద్ధ తంత్రాలలో నిష్ణాతుడయ్యాడు.సకల విద్యలు తెలుసుకొన్న శివాజీ మరాఠా సామ్రాజ్య స్థాపనే లక్ష్యంగా తన వ్యూహాలు మొదలు పెట్టాడు.జూన్ 6, 1674న రాయఘడ్ కోటలో వేద పఠనాల మధ్య శివాజీని క్షత్రియ రాజులందరికీ అధిపతిగా కీర్తిస్తూ 'ఛత్రపతి ' అని బిరుదును ప్రదానం చేసారు.27 ఏళ్ళపాటు యుద్ధాలలో గడిపి హిందూ రాజులకు ఆదర్శంగా నిలిచి,సువిశాల మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పిన ఛత్రపతి శివాజీ 1680,ఏప్రిల్ 3వ తేదీన మరణించాడు.1999వ సంవత్సరంలో శివాజీ ముఖచిత్రం తో కూడిన 2రూపాయల నాణెములను భారత ప్రభుత్వం విడుదల చేసింది.

**-కొల్లాబత్తుల సూర్య కుమార్.**

# బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్

**జిల్లా ఆదనపు కలెక్టర్ బిఎస్ లత**

**జగిత్యాల ఫిబ్రవరి 18(వార్తా ప్రభ ప్రతినిధి):**బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ ఆనిజగిత్యాల జిల్లా ఆదనపు కలెక్టర్ బిఎస్ లత అన్నారు.మంగళవారంజిల్లా గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను జిల్లా కేంద్రంలోని బంజారా భవన్ ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అదనపు బిఎస్ లత హాజరై సంతు సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి జయంతి వేడుకలను ప్రారంభించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ లత మాట్లాడుతూ బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జీవితం సర్వ మానవాళికి ఆదర్శనీయం అన్నారు. ఆయన జయంతి ని పురస్కరించుకొని ఫిబ్రవరి 15న తెలంగాణ ప్రభుత్వం బంజారా కమ్యూనిటీ ఉద్యోగులకు సెలవు ప్రకటించిందని, సమస్త జీవకోటికి మాతృ రూపం అమ్మ భవాని అని అమ్మను పూజించాలి కానీ ఫలితం ఆశించవద్దని బంజారాలకు సేవాలాల్ మహారాజ్ బోధించారని అన్నారు.సంత్ సేవాలాల్ మహారాజ్ హింస పాపమని మత్తు, ధూమపానం శాపం మని హితవు పలికారన్నారు. ఆయన బంజారా జాతికే కాదు యావత్తు ఇతర కులాలకు ఆదర్శ పురుషుడయ్యాడని కొనియాడారు. సంత్ సేవాలాల్ మహారాజ్ ప్రజల మేలు కోసం అనేక ఉద్యమాలు చేశారని తెలిపారు. .ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కే. రాజ్ కుమార్ ,జిల్లా విద్యాధికారి జగిత్యాల తాహసిల్దార్ రామ్మోహన్, జ మండలం పరిషత్ అభివృద్ధి అధికారి ని వాసవి, వివిధ శాఖల ఉన్నతాధికారులు, గిరిజన సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మహిళలు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బి జె పి ఎమ్మెల్సీ అభ్యర్థి తరుపున ప్రచారం

**హుస్నాబాద్ ఫిబ్రవరి 18(వార్తా ప్రభ ప్రతినిధి):** హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండలంలోని దుబ్బతండ, చాపగాని తండా, కట్కూర్ గ్రామాలలో గ్రాడ్యుయేట్ ఉమ్మడి కరీంనగర్, అదిలాబాద్, మెదక్, నిజామాబాద్, ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ అంజిరెడ్డి చిన్న మైల్ ను ఆశీర్వదించి మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరుతూ అక్కన్నపేట మండల బిజెపి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇన్చార్జి గుగులోతు తిరుపతి నాయక్ ఆధ్వర్యంలో ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రాడ్యుయేట్ భద్రతకు హామీతో పాటు ఒత్తిడి మానసిక ఆందోళనతో బాధపడే యువత కోసం 24 గంటల హెల్ప్ లైన్, పి. ఎం. జె. జె. బై (%జూఎంఎం%) ద్వారా 100% గ్రాడ్యుయేట్లకు భీమ కవరయ్యేలా చర్యలు తీసుకుంటారన్నారు. అలాగే పాత్రికేయుల హక్కుల కోసం పోరాటం చేసి కనీస వేతనం, సామాజిక భద్రత, మహిళలకు భద్రత తో పాటు పని వేళలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి మార్గం చూపుతారన్నారు. పట్టభద్రులందరూ వారి ఓటుతో వారి బంగారు భవిష్యత్తుకు బలమైన పునాదులకు బాటలు వేయాలని కోరారు.

# ఓబిసి కార్యక్రమంలో జిల్లా చైర్మన్

**అదిలాబాద్ ఫిబ్రవరి 18(వార్తా ప్రభ ప్రతినిధి):** హైదరాబాద్ గాంధీ భవనంలో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,ఓబిసి స్టేట్ ప్రెసిడెంట్ నూతి శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి ఓబీసీ కార్యక్రమానికి జిల్లా ఓబీసీ చైర్మన్ అంబకంటి అశోక్ హాజరై మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు బీసీలను అత్యధికంగా గెలిపించుకోవాలని కోరారు అలాగే ఆ కార్యక్రమంలో టిపిసిసి ఓబీసీ స్టేట్ వైస్ చైర్మన్ బండి ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,పిసిసి ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, నూతి శ్రీకాంత్ గౌడ్,వర్కింగ్ ప్రెసిడెంట్ అంజనీ కుమార్ యాదవ్,బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్,అందరూ సహకరించి బీసీలకు 42 రిజర్వేషన్ కల్పించడానికి కృషి చేసిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ రాష్ట్రంలో 6 గ్యారంటీలో లో భాగంగా మహిళలకు రూ.2,500 పెన్షన్ వృద్ధులకు వికలాంగులకు ఆసరా పెన్షన్లు రూ.4 వేల చొప్పున ఇస్తామని విధంగా ముఖ్యమంత్రిని కోరామని తెలిపారు.

# సలార్ రికార్డ్ బ్రేకింగ్.. 366 రోజులు ట్రెండింగ్



సలార్– పార్ట్ 1 అద్భుతమైన విజయం తర్వాత సలార్ పార్ట్ 2: శౌర్యంగ పర్వం రాక కోసం అభిమానులు ఎంతో ఎగ్జయిటింగ్ గా వేచి చూస్తున్న సంగతి తెలిసిందే. బ్లాక్ బస్టర్ ఫ్రాంచైజీలో రెండవ భాగం 2026 లో వెండితెరపైకి వచ్చే అవకాశం ఉంది. ఈ భారీ యాక్షన్ చిత్రం కోసం హొంబలే బ్యానర్ అత్యంత భారీ బడ్జెట్ ని వెచ్చించనుందని టాక్ వినిపిస్తోంది. సలార్, కల్కి 2898 ఏడి సంచలన విజయాలతో ఫుల్ జోష్ మీద ఉన్న ప్రభాస్ ప్రస్తుతం వరుసగా రెండు చిత్రాల్లో నటిస్తున్నాడు. ఆ రెండూ రిలీజయ్యే క్రమంలోనే అతడు సలార్ 2 పైనా ఫోకస్ చేయనున్నాడు. ఇలాంటి సమయంలో సలార్ బృందానికి, ప్రభాస్ అభిమానులకు గుడ్ న్యూస్ అందింది. సలార్ బాక్సాఫీస్ వద్ద రికార్డులను సృష్టించడంలోనే కాదు, ఈ సినిమా అద్భుతమైన థియేటర్ రన్ తర్వాత OTTలోను 366 రోజుల నిరంతరం ట్రెండింగ్ ద్వారా ప్రత్యేకమైన ముద్ర వేసింది. జియో హాట్‌స్టార్ లో సలార్: సీజ్ ఫైర్ ఆదరణకు ఫిదా అయిన ప్రభాస్ దీనిపై స్పందిస్తూ.. త్వరలో ఖాన్సార్‌లో అడుగు పెట్టడానికి వేచి ఉండలేను అని ఆనందం వ్యక్తం చేశారు. మునుపెన్నడూ లేని విధంగా పాలన... చసలార్ జియో హాట్ స్టార్ లో ట్రెండింగ్‌లో ఉంది.. సంవత్సర కాలంగా ఆధిపత్యం చెలాయిస్తోంది అని హొంబలే సంస్థ సోషల్ మీడియాల్లో ఆనందం వ్యక్తం చేసింది. సలార్ హిందీ వెర్షన్ సైతం 3కోట్ల (30 మిలియన్ల) వీక్షణలతో సంచలనం సృష్టించింది. ఈ చిత్రంో టాప్ ట్రెండింగ్ చిత్రాలలో ఒకటిగా నిలిచింది. రాజులు రాజ్యాలు అంతరించిపోయినా ఖాన్సార్ ప్రపంచంలో సరికొత్త రాజ్యాన్ని సృష్టించిన ప్రశాంత్ నీల్.. భారీ యాక్షన్ ని సృష్టించేందుకు ఎమోషన్స్ ని పెంచేందుకు అవకాశం ఉన్న ప్రతి అంశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. ఈ చిత్రంలో పృథ్వీరాజ్ సుకుమారన్, శ్రుతి హాసన్, జగపతి బాబు, బాబీ సింహా, శ్రియ రెడ్డి తదితరులు నటించారు.

# సిద్దూ తో నాగ వంశీ చెప్పిన మూవీ అదేనా?

టాలీవుడ్ లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా కెరీర్ ను మొదలుపెట్టిన సిద్దు జొన్నలగడ్డ ఇప్పుడు సక్సెస్‌ఫుల్ హీరోగా ముందుకు దూసుకెళ్తున్నాడు. నటనతో మాత్రమే కాకుండా రైటర్ గా కూడా తనదైన టాలెంట్ ను నిరూపించుకున్నాడు. ప్రస్తుతం సిద్దూ తో సినిమా చేస్తే మినిమం గ్యారెంటీ ఉంటుందనే రేంజ్ కు అతను చేరుకున్నాడు. అయితే సిద్దు ఎన్ని సినిమాలు చేసినా తనకు మంచి ఫామ్, క్రేజ్, ఫాలోయింగ్ తెచ్చిపెట్టింది మాత్రం టిల్లు ఫ్రాంఛైజ్ సినిమాలే. డీజే టిల్లు సినిమాతో ఓవర్ నైట్ స్టార్ అయిపోయాడు సిద్దు. గతేడాది వచ్చిన టిల్లు స్క్వేర్ సినిమా కూడా బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్లకు పైగా వసూలు చేసి సిద్దూ మార్కెట్ ను మరింత పెంచింది. సిద్దుకి టాలీవుడ్ లో ఇప్పుడు మంచి డిమాండే ఉంది.

# సాంకేతికతను సాగులోకి తీసుకురావడమే ప్రభుత్వ ఉద్దేశం - కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

**ఘంటసాల : అవనిగడ్డ,ఫిబ్రవరి 18 (వార్తాప్రభ) :** సాంకేతికతను సాగులోకి తీసుకురావడమే ప్రభుత్వ ఉద్దేశమని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. ఘంటసాలలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రాంగణంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ పరిశోధనా స్థానం, కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో కిసాన్ మేళాను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ బాలాజీ క్షేత్ర సందర్శన, వ్యవసాయ ప్రదర్శనలో భాగంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. తొలుత విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మి దేవి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన వంగడాల గురించి ప్రధాన శాస్త్రవేత్తలు రైతులకు వివరించారు. వ్యవసాయంలో నూతన పద్ధతులు, సమస్యలపై రైతులు అడిగిన ప్రశ్నలకు శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు. వరి మాగణుల్లో అపరాల సాగు, సవాళ్లు, భవిష్యత్తు కార్యాచరణ అంశాలపై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఘంటసాల వ్యవసాయ పరిశోధన స్థానం



వారు ప్రచురించిన వరి మాగాణులలో మినుము పెసర సాగు యాజమాన్యం, వరి మాగాణి మినుముని ఆశించే కాండం గజ్జి తెగులు యాజమాన్యం పుస్తకాలను అతిధులచే ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాగంగా రైతులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని కిసాన్ మేళా తరుపున శాస్త్రవేత్తలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విస్తరణ సంచాలకులు డాక్టర్ జి శివ నారాయణ, పరిశోధన సంచాలకులు పీవీ సత్యనారాయణ, సహ పరిశోధనా సంచాలకులు ఎన్.వి.వి.ఎస్ దుర్గాప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.పద్మావతి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి నరసింహులు, ఘంటసాల వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వి.సత్యప్రియ లలిత, కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి, ఉద్యానవన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జ్యోతి, ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ కే.నాగేంద్రరావు, డాక్టర్ ఎం.గిరిజారాణి, డాక్టర్ డి.మోహన్ రెడ్డి, డాక్టర్ సి.వి.చంద్రమోహన్ రెడ్డి, డాక్టర్ డి.ఆదిలక్ష్మి, డాక్టర్ ఎస్.రాజామణి, డాక్టర్ ఎస్.ప్రతిభ శ్రీ, ఎం.జ్యోతిరమణి, వి.నరసింహారావు, డాక్టర్ ఎస్.కృష్ణంరాజు, డాక్టర్ కె.అచ్యుతరాజు, డాక్టర్ జి.రమేష్, ఇతర శాస్త్రవేత్తలు, సాంకేతిక సిబ్బంది , రైతులు పాల్గొన్నారు.

## ఆలపాటిని గెలిపించండి ఎన్నికల ప్రచారంలో కృత్తివెన్ను కూటమి నాయకులు



**కృత్తివెన్ను,ఫిబ్రవరి 18 (వార్తాప్రభ) :** పెడన శాసన సభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ ఆదేశాలతో కృష్ణా, గుంటూ రు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం లో ఈ రోజు కృత్తివెన్ను మండలం చెరుకుమిల్లి లో ఎంసిపిల్ సీనియర్ రిపోర్టర్ పట్టపు రమేష్ ను మరియు గ్రామంలోని ఓటర్లను కలసి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ కు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి విజయాన్ని చేకూర్చాలని కృత్తివెన్ను కూటమి నాయకులు ప్రచారం చేశారు ఈ ప్రచార కార్యక్రమంలో పట్టపు నాగుల మీరా పట్టపు రాధా కృష్ణ కూనసాని చిన్నా పట్టపు శ్రీనివాస రావు పట్టపు రాంబాబు పట్టపు సరస్వతిరావు బండ్రెడ్డి నాగబాబు జొన్నాల వేంకటేశ్వర రావు మరియు కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిన్న వంశీ.. రేపు కొడాలి నాని?



**గుడివాడ,ఫిబ్రవరి 18 (వార్తాప్రభ) :** ఏపీలో అధికార కూటమి ప్రభుత్వం వైసీపీ పాలనలో అక్రమాలు.. దౌర్జన్యాలకు పాల్పడిన నేతలపై చట్టపర చర్యల విషయమై దూకుడుగా ముందుకెలుతుంది. తొలుత వైసీపీ సోషల్ మీడియా భరతం పట్టిన చంద్రబాబు ప్రభుత్వం.. ఎన్నికలలో వైసీపీ ప్రభుత్వం అండతో హింసకు పాల్పడిన వారిపైన చర్యలకు ఉపక్రమించింది. కీలక వైసీపీ నాయకులపైన, మాజీ ఎమ్మెల్యేలపైన ఉన్న కేసులను తిరగదోడింది. ఇసుక అక్రమ రవాణా, భూకబ్జా వంటి కేసులలో విచారణ ముమ్మరం చేసింది. తదుపరి అగ్రిగోల్డ్ భూముల వివాదంలో మాజీ మంత్రి జోగి రమేష్ కుటుంబంపైన.. అదే క్రమంలో ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యం మళ్లింపు కేసులో మాజీ మంత్రి పేర్నినాని దంపతులపై చట్టం కొరడా ఝుళిపించింది. ఇటీవల మరో మాజీ మంత్రి విడుదల రజనిపై అట్రాసిటీ కేసు నమోదు చేసింది. తాజాగా టీడీపీ కార్యాలయం దాడి కేసులో వైసీపీ గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని అరెస్టు చేసి రిమాండ్ చేసింది. ఈ క్రమంలో తదుపరి అరెస్టు మాజీ మంత్రి కొడాలి నాని దే కావచ్చన్న ప్రచారం బలంగా వినిపిస్తుంది. మంగళవారం వంశీని వైసీసీ అధినేత, మాజీ సీఎం వైఎస్. జగన్ వెంట విజయవాడ జైలుకు వచ్చిన కొడాలి నాని ఆనంతరం అజ్ఞాతంలోకి వెళ్లినట్లుగా ప్రచారం వినిపిస్తుంది. తన ఫోన్లు కూడా స్విచాఫ్ చేసుకున్నట్లు సమాచారం. ఇప్పటికే గుడివాడలో కొడాలి నానిపై మూడు కేసులు నమోదయ్యాయి. తాజాగా లిక్కర్ కుంభకోణంపై విచారణ మొదలైంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగాన్ని నడిపిస్తుందని.. ఈ మేరకు రాజకీయ అరెస్టులు సాగిస్తుందని వైసీపీ మండిపడుతోంది. కాగా విజయవాడ జైలు వద్ద నాని మీడియాతో మాట్లాడుతూ కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడితే ఎవ్వడిని వదిలిపెట్టమని.. అట్టుపెట్టినోడికి అంటున్నారా రెండట్లు పడతాయన్నారు. చావైనా బ్రతికైనా జగనన్నతోనే మా ప్రయాణమని స్పష్టం చేశారు.

## ఆధ్యాత్మిక జ్ఞాన సముపార్జనకు కుంభమేళాలు దోహదం -రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

**అమరావతి,ఫిబ్రవరి 18 (వార్తాప్రభ) :** ఆధ్యాత్మికతకు, సంప్రదాయాలకు కుంభమేళాలు పునాదులని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత అభిప్రాయపడ్డారు. మహా కుంభమేళా ఆధ్యాత్మిక కార్యక్రమం మాత్రమే కాదని, కోట్లాదిమంది భారతీయుల సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అని తెలిపారు. మంగళవారం ప్రయాగ్ రాజ్ లోని త్రివేణి సంగమం వద్ద భర్త సి.వెంకటేశ్వరరావు, కుమారుడు జగదీష్ తో కలిసి మంత్రి సవిత పుణ్య స్నానాలు ఆచరించారు. ఈ సందర్భంగా గంగానదికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపు కుంకుమ, పువ్వులు సమర్పించి హారతి ఇచ్చారు. పితృదేవతలకు తర్పణాలు వదిలి, బ్రాహ్మణులకు వస్త్ర దానం చేశారు. 'అమృత ఘడియల్లో పవిత్ర నదుల్లో పుణ్య స్నానాలు ఆచరించడం వల్ల మోక్షం లభిస్తుందని పురాణాలు, వేదాలు చెబుతున్నాయి. కుంభమేళాలు భారతీయ ఆధ్యాత్మికతకు, సంస్కృతీ సంప్రదాయాలకు పునాదులు వంటివి. ముఖ్యంగా ధర్మంపై విశ్వాసం పెంపుదలకు, ఆధ్యాత్మిక జ్ఞాన సముపార్జనకు మార్గం చూపుతాయని కోట్లాదిమంది నమ్మకం' అని ఒక ప్రకటనలో మంత్రి సవిత తెలిపారు.



## "జ్ఞాన జ్యోతి" పేరుతో అంగన్వాడీ కార్యకర్తల కు 18 నుండి 25 వరకు శిక్షణా కార్యక్రమాలు...

**పెనుగంచిప్రోలు,ఫిబ్రవరి 18 (వార్తాప్రభ) :** "జ్ఞాన జ్యోతి" పేరుతో అంగన్వాడీ కార్యకర్తలకు 18 తేదీ మంగళవారం నుండి 25 తేదీ మళ్ళీ మంగళవారం వరకు పెనుగంచిప్రోలు,కె. వి. ఆర్.పాఠశాల లో శిక్షణా కార్యక్రమం నిర్వహించడ మైనదని ఈ శిక్షణా కార్యక్రమానికి కోర్సు డై రెక్టర్, ఎం ఇ ఓ, రవీంద్రర్, పాఠశాల ప్రదానోపాధ్యాయు రా లు, జలజ ప్రారంభించారు,ఈ సందర్భంగా ఎం ఇ ఓ రవీంద్రర్ మాట్లాడుతూ పూర్వ ప్రాధామిక విద్యను బలోపేతం చేయడం నాణ్య మై న విద్యే లక్షంగా పనిచేయాలని తెలియజేశారు, ఈ కార్యక్రమానికి రిశోర్సు పర్సన్స్ గా పాము, నాగేశ్వర రావు, ప్రకాష్, ప్రై మర్ సాహెబ్, మరియు అంగన్వాడీ గ్రేడ్ -1,2,సూపర్ వై జర్స్, ఉష, సువర్ణ, వ్యవహరించిన్నారు, ఈ కార్యమానికి పెనుగంచిప్రోలు మండలం నుండి 54 మంది, జగ్గయ్యపేట మండలం నుండి 34 మంది మొత్తం 88 మంది అంగన్వాడీ కార్యకర్తలు శిక్ష ణా కార్యక్రమంలో పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో ఐ సీ డీ ఎస్ సేవలు, లక్ష్యాలు, నిపూన్ భారత్ డో మై న్స్ ఎఫ్ ఎల్ ఎన్ అభివృద్ధి లక్షయాలు,ఈ సీ సీ ఈ సమగ్ర అభివృద్ధి లక్ష్యాలు, వివిధ రకాల పాలసి డాం క్యు మెంట్స్ పై ఆర్ పీ లు అవగాహన కల్పించి న్నారు, ఈ కార్యక్రమంలో సీ ఆర్ పీ లు జొన్నలగడ్డ, చిన్న గోపాలరావు, డీ. బాబు, సి హెచ్. సాంబ, ఎం, ఆంజినేయులు పాల్గొన్నారు.





మంగళవారం మధ్యాహ్నం దొండపాడు జనసేన నాయకులు కాకి బాబ్జి అన్నయ్య కాకి రాంబాబు వర్ధంతి సందర్భంగా అన్న క్యాంటీన్ నందు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తొలుత ముఖ్య అతిధిగా పాల్గొన్న గుడివాడ జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ అన్నదానాన్ని ప్రారంభించారు. అలాగే ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మజ్జి శ్రీనివాస రావు, పట్టణ ప్రధాన కార్యదర్శి సాయన రాజేష్, మండల అధ్యక్షులు ఇంటూరి గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.
-గుడివాడ,ఫిబ్రవరి 18 (వార్తాప్రభ) :

## ప్రమాదంలో గాయపడిన టిడిపి నాయకులను పరామర్శించిన కృత్తివెన్ను కూటమి నాయకులు



**కృత్తివెన్ను,ఫిబ్రవరి 18 (వార్తాప్రభ) :** బంటుమిల్లి మండలం ములపర్రుపంచాయితీ రామన్న మోడి గ్రామ తెలుగు దేశం పార్టీ కార్యకర్తలు ఇటీవలరోడ్డు ప్రమాదం లో గాయపడిన బొడ్డు నాగార్జున తమ్ము మారయ్యలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకుని డిస్చార్జ్ అయి ఇంటికి వచ్చిన సందర్భముగా వారిని కృత్తివెన్ను మండల కూటమి నాయకులు పరామర్శించారు ఈ పరామర్శలో భాగంగా వారి యొక్క యోగక్షేమాలు అడిగి తెలుసుకుని వారికి మరియు కుటుంబ సభ్యులకు బాసటగా నిలుస్తామని ధైర్యాన్నిచ్చారు పార్టీ బలోపేతానికి కృషి చేసిన నాయకులను కార్యకర్తలను కూటమి ప్రభుత్వం చేయి విడవదని ఈ సందర్భంగా వారు తెలిపారు ఈ పరామర్శలో కృత్తివెన్ను మండల తెలుగుదేశం పార్టీ ప్రధానకార్యదర్శి పిన్నెంటి రత్తయ్య యండపల్లి గ్రామ తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు బత్తుల పూర్ణ పిన్నెంటి గణేష్ పిన్నెంటి సత్యం బాబు బొడ్డు కృష్ణ పాల్గొన్నారు

# గడ్డమణుగు లోయలో మైనింగ్ మాఫియా...!

- 17 కంకర లారీలు సీజ్ చేసిన మైనింగ్ అధికారులు
- రూ. 22,500 లు చొప్పున 7లారీలకు ఫైన్
- మరో 7లారీలు జి.కొండూరు పోలీస్ స్టేషన్ కి తరలించిన మైనింగ్ అధికారులు
- క్రషర్ల లో మైనింగ్ సిబ్బంది పర్యవేక్షణలో మిగిలిన 3 లారీలు
- మైనింగ్ బిల్స్ లేకుండా కంకర అక్రమ రవాణా చేస్తున్నారనే దాడులు చేశాం :మైనింగ్ ఏడి





**జి.కొండూరు,ఫిబ్రవరి 18 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా, జి.కొండూరు మండలం,గడ్డమణుగు గ్రామ శివారు లోయ ప్రాంతంలో జరుగుతున్న మైనింగ్ మాఫియా పై మైనింగ్ ఏడి సిబ్బందితో కలిసి సోమవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. లోయ ప్రాంతంలో ఉన్న క్రషర్ల నుంచి మైనింగ్ బిల్లులు లేకుండా కంకర రవాణా చేస్తున్న 17 లారీలను కట్టుబడిపాలెం గ్రామ శివారులో మైనింగ్ ఏడి వీరాస్వామి స్వాధీనం చేసుకున్నారు. లారీలను జి.కొండూరు పోలీస్ స్టేషన్ కి తరలించే క్రమంలో లారీల ఓనర్లు అడ్డుకొని లారీలను వదిలేయాలంటూ మైనింగ్ అధికారులను వేడుకున్నారు.మైనింగ్ బిల్లులు ఇవ్వకపోవడం క్రషర్ల యాజమాన్యం బాధ్యత అని, కిరాయి కోసం వచ్చిన లారీలను సీజ్ చేయడం ఏమిటని మైనింగ్ అధికారులను ప్రశ్నించారు.ఇలా చేస్తే తాము నష్టపోతామని అధికారులను ప్రాధేయపడ్డారు. అయినా మైనింగ్ అధికారులు ఏ మాత్రం వెనక్కి తగ్గలేదు.క్రషర్ల యాజమాన్యం బిల్స్ ఇవ్వకపోతే కంకర రవాణా ఎలా చేస్తారని,ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమని మైనింగ్ అధికారులు లారీల యజమాను లను ప్రశ్నించారు.అయితే అనుమతులు ఉన్న క్వారీలు క్రసర్ల వివరాలు ఇవ్వండి అని లారీల యజమానులు మైనింగ్ ఏడి ని అడిగారు.దీనిపై లారీల ఓనర్లకు మైనింగ్ అధికారులకు కొంత వాగ్వాదం జరిగింది. అధికారులు వెనక్కి తగ్గలేదు.పట్టుబట్టి మరీ 17 లారీ లను స్థానిక పోలీసుల ద్వారా స్టేషన్ కి తరలించారు. వీటిలో 7 లారీలకు అదే రోజు రాత్రి ఒక్కొక్క లారీకి రూ.22,500 చొప్పున ఫైన్ వేశారు. మరో 7 లారీలు పోలీస్ స్టేషన్ వద్ద ఉండగా, మిగిలిన 3లారీలు లోయలో క్రషర్లలో ఉన్నాయని అవి మైనింగ్ సిబ్బంది పర్యవేక్షణలో ఉన్నాయని అధికారులు వెల్లడించారు.

### బిల్స్ లేకుండా కంకర అక్రమ రవాణా చేస్తున్నారనే దాడులు చేశాం :మైనింగ్ ఏడి వీరాస్వామి ..

మైనింగ్ ఏడి వీరాస్వామి ని వివరణ కోరగా బిల్స్ లేకుండా కంకర అక్రమంగా రవాణా చేస్తున్నారనే దాడులు చేశామన్నారు.మొత్తం 17లారీలను సీజ్ చేశామని, వీటిలో 7లారీలకు రూ. 22,500 లు చొప్పున ఫైన్ విధించినట్లు తెలిపారు. 7లారీలు పోలీస్ స్టేషన్ కి అప్పగించడం జరిగిందనీ, మరో 3లారీలను మా గార్డ్స్ పర్యవేక్షణలో ఉన్నాయని తెలిపారు.రాతి క్వారీ, క్రషర్ల యజమానులు తప్పనిసరిగా అనుమతు లు తీసుకోవాలని,మైనింగ్ బిల్స్ తప్పనిసరి అన్నారు.

## ఆలిండియా స్థాయిలో ప్రతిభ చాటిన గౌతమ్ స్కూల్ విద్యార్థి..



**గుడివాడ,ఫిబ్రవరి 18 (వార్తాప్రభ) :** జనవరి 30 నుండి ఫిబ్రవరి 2వ తేది వరకు తమిళనాడులోని కన్యాకుమారి నందు జరిగే ఆలిండియా సలంబం పెడరేషన్ ఛాంపియన్ షిప్ పోటీలలో గుడివాడకు చెందిన గౌతమ్ స్కూల్ విద్యార్థి బి.కార్తికేయ, ద్వితీయ స్థానం సాధించి ఘనమైన ప్రతిభ చాటాడని ప్రిన్సిపాల్ పి. లక్ష్మి ప్రసాద్ తెలిపారు. గెలుపొందిన విద్యార్థిని మరియు కోచ్ ఎన్.వెంకటేశ్వరరావు లను పాఠశాల ఆవరణలో జరిగిన సభలో ప్రిన్సిపల్స్ శ్రీ సత్యారామ్, శ్రీ లక్ష్మీప్రసాద్, శ్రీమతి జ్యోతి, శ్రీమతి ప్రశాంతి లు అభినందించారు.

## కూటమి అభ్యర్థి ఆలపాటిని గెలిపించాలి..




**గుడివాడ,ఫిబ్రవరి 18 (వార్తాప్రభ) :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎలక్షన్ సమావేశంలో భాగంగా స్థానిక శ్రీ షైనింగ్ స్టార్ స్కూల్ నందు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదేశాల మేరకు నిర్వహించిన ఎమ్మెల్సీ మీటింగ్ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు దింట్యాల రాంబాబు మాట్లాడుతూ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ని గెలిపించుకోవాల్సిన బాధ్యత మన అందరిది అన్నారు. మొదటి ప్రాథమిక ఓటును రాజేంద్రప్రసాద్ కి వేసి గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని స్థానిక పట్ట భద్రులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి నాయకులు జబీన్, కరిముల్లా, పట్టపు చిన్న, షేక్ జునైద్, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీరు, ఉపాధి హామీ పథకం పనులకే ప్రాధాన్యం..



**గుడివాడ,ఫిబ్రవరి 18 (వార్తాప్రభ) :** సోమవారం రూరల్ మం॥లో జరుగుతున్న వివిధ ప్రభుత్వ సర్వేల పురోగతిపై ఎంపీడీవో బీ.వై. విష్ణు ప్రసాద్ అధ్యక్షతన సచివాలయ సిబ్బందికి రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు కార్యదర్శులు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని కోరారు. గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడే ఉపాధి హామీ పథకం పనులు చేయాలని ఆయన కోరారు. ముఖ్యంగా కార్యదర్శులు పరిసరాల పరిశుభ్రతతో పాటు వైద్యం విషయంలో కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే ఆర్‌డబ్ల్యుఎస్ ఏ.ఈ అట్లూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో త్రాగు నీటి చెరువుల పరిశుభ్రత, ఫిల్లింగ్ స్టేటస్, ఓడిఎఫ్ ప్లస్ సోక్ పీట్స్ నిర్మాణ పురోగతి పై కూడ సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈ.వో పిఆర్డి ఎస్.శ్రీనివాసరావు, పలువురు పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలపై కరపత్రాలు పంపిణీ..



**గుడివాడ,ఫిబ్రవరి 18 (వార్తాప్రభ) :** గుడివాడ వాకర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నెహ్రూ చౌక్ సెంటర్లో టూ టౌన్ సి.ఐ మరియు ట్రాఫిక్ ఎస్ఐల సమక్షంలో ట్రాఫిక్ నిబంధనలు అవి పాటించక పోతే వచ్చే నష్టాలు అన్నింటి మీద సమీక్ష నిర్వహించి కరపత్రాన్ని పోలీసుల చేతుల మీదుగా విడుదల చేయడం చేశారు. ఈ ట్రాఫిక్ వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఈ రోజున గుడివాడ వాకర్స్ అసోసియేషన్ తరపున నిర్వహించాము. ఈ కార్యక్రమానికి ప్రెసిడెంట్ డివి సత్యనారాయణ, చలివాది మోహన్ రావు, పామర్తి కేశవరావు, తాత భాస్కర్, మెరుగు మాల బ్రహ్మయ్య, వీరశేఖర్, టైలర్ రాజు, వేణు బాబు, పలువురు వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

## జేఎన్టీయూకే వీసీగా ప్రొ. ప్రసాద్

**కాకినాడ,ఫిబ్రవరి 18 (వార్తాప్రభ) :** జేఎన్టీయూకే ఉపకులపతిగా ప్రొఫెసర్ సిఎస్ఆర్కె ప్రసాద్ నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రసాద్ వరంగల్ నిట్ సివిల్ ఇంజినీరింగ్, ట్రాన్స్పోర్ట్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు మురళీకృష్ణ ఇంచార్జి వీసీగా విధులు నిర్వహిస్తున్నారు.



**BEFORE THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL CUM XIII ADDL. DISTRICT JUDGE AT VIJAYAWADA**

MVOP NO.86/2022

Between :

1. Basava Vijaya Lakshmi @ Vijaya laxmi

-----Petitioners

And

1. Dasari Shekhar
2. Dasari Naga Lakshmi
3. Tata AIG General Insurance Co. Ltd.

-----Respondents

To,

Respondents No . 1 & 2

1. Dasari Sekhar, S/o Venkateswara Rao, Hindu, Aged About 37 Years, D.No.49-4-15/5, Adarsa colony, Ulavacharu Company road, Gunadala, Vijayawada, NTR Dist-520004.
2. Dasari Naga Mani, W/o Sekhar, Hindu, Aged about 30 years, D.No. 49-4-15/5, Adarsa colony, Ulavacharu Company road, Gunadala, Vijayawada, NTR Dist-520004.

పై నెంబర్ పిటిషన్ ను పిటిషనర్ తనకు జరిగిన రోడ్డు ప్రమాదంలో తగిలిన గాయములకు నష్ట పరిహారం కోరుతూ పై పిటిషన్ ను దాఖలు చేయగా సదరు ఒకటవ మరియు రెండవ రెస్పాండెంట్స్ అయిన మీయొక్క హాజరు నిమిత్తం శ్రీ కోర్ట్ వారు ది.06-03-2025నకు వాయిదా వేసి వున్నారు, కావున తేది. 06-03-2025 ఉదయం గం. 10:30 ని లకు మీరు స్వయంగా గాని లేదా న్యాయ వాది ద్వారా గాని పై కోర్ట్ వారి ఎదుట హాజరై మీకు గల అక్షేపణలు తెలుపు కొనవలెను లేని యెడల మీకు పరోక్షంగా తీర్మానించబడును.

By Court Order

**B. SURYA PRAKASA RAO**
**Advocate, Vijayawada, Cell.9849695243**


# విలేకరిపై దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయండి - ప్రెస్ క్లబ్ సభ్యుల డిమాండ్

**ఆగిరిపల్లి,ఫిబ్రవరి 18 (వార్తాప్రభ) :** పార్వతి పురం మన్యం జిల్లా మక్కువ మండలం ప్రజా శక్తి విలేకరి మాల్యాడ రామారావు పై మండల తెలుదేశం పార్టీ అధ్యక్షులు గుల్ల వేణుగోపాల నాయుడు దాడి కి పాల్పడటమే కాకుం డా సదరు విలేకరిని చంపేస్తానని భయబ్రాం తులకు గురిచేయడం పై సదరు వేణు గోపాల నాయుడు ని వెంటనే అరెస్ట్ చేయాలని, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆగిరిపల్లి మండల ప్రెస్ క్లబ్ తరుపున తహసీల్దార్ వారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.




**BEFORE THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL CUM XII ADDL. DISTRICT JUDGE AT VIJAYAWADA**

MVOP NO.222/2023

Between :

Pasupuleti Ranga Nayakamma and 5 Others

-----Petitioners

And

1. Venigandla Baji Rao
2. Chillakala Venkata Mangapathi Rao
3. Tata AIG General Insurance Co. Ltd.,

-----Respondents

Tom

**Respondent No.2**

Chillkala Venkata Mangapathi Rao, S/o Seetharamayya, Hindu, aged about 47 years, D.No.11-23-1/1 Ramireddy pet, Narasaraopet, Guntur Dist-522601.

పై నెంబర్ పిటిషన్ ను పిటిషనర్ తనకు జరిగిన రోడ్డు ప్రమాదంలో తగిలిన గాయములకు నష్ట పరిహారం కోరుతూ పై పిటిషన్ ను దాఖలు చేయగా సదరు రెండవ రెస్పాండెంట్ అయిన మీయొక్క హాజరు నిమిత్తం శ్రీ కోర్ట్ వారు ది.27-02-2025నకు వాయిదా వేసి వున్నారు, కావున తేది.27-02-2025 ఉదయం గం. 10:30 ని లకు మీరు స్వయంగా గాని లేదా న్యాయవాది ద్వారా గాని పై కోర్ట్ వారి ఎదుట హాజరై మీకు గల అక్షేపణలు తెలుపు కొనవలెను లేని యెడల మీకు పరోక్షంగా తీర్మానించబడును.

By Court Order

**B. SURYA PRAKASA RAO**
**Advocate, Vijayawada, Cell.9849695243**


# ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి గెలుపుకి కృషి చేయాలి



**కంకిపాడు,ఫిబ్రవరి 18 (వార్తాప్రభ) :** ఎమ్మెల్సీ అభ్యర్థిగా కూటమి పార్టీ తరపునుంచి పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపుకి కూటమి నాయకులు కృషి చేయాలని కంకిపాడు గ్రామ యూనిట్ ఇంచార్జ్ కె. రమేష్ అన్నారు. మండల కేంద్రమైన కంకిపాడులో మంగళవారం కంకిపాడు గ్రామ కూటమి నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ గ్రామంలో గ్రాడ్యుయేట్ ఓట్లు సుమారు 590 ఉన్నాయి. ప్రతి 30 ఓట్లుకు ఒకరు ఇన్చార్జిగా బాధ్యత తీసుకొని ప్రతిరోజు వారి పరిధి లోని ఓటర్లను కలిసి కూటమి అభ్యర్థికి ఓటు వేసే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రతినిధులు వి. విక్రం, కొండ నాగేశ్వరరావు, పులి శ్రీను, వెంకట్, అన్నే రామారావు, దివి రోహిని, పి కృష్ణమోహన్, శ్రీనివాసరావు, బోయిన నాగరాజు, కోన నాని, చిట్టూరి బుజ్జి, రాజా తదితరులు పాల్గొన్నారు.

# అన్నదానానికి విరాళం



**పిఠాపురం, ఫిబ్రవరి 18 (వార్తాప్రభ) :** కాకినాడకు చెందిన కలిదిండి భాస్కర నారాయణ రాజు దంపతులు, శ్రీ కుక్కుటేశ్వర స్వామి వారి దేవస్థానం నిత్య అన్నదానం ట్రస్ట్ కు రూ. 1,01,116/-లను మంగళవారం అందజే శారు. శాశ్వత అన్నదాన పథకానికి విరాళం ఇచ్చి ప్రతి సంవత్సరం మార్చి 3 తేదీన అన్నదానం జరపాలని వారు కోరారు.అన్నదాన పథకం పత్రాన్ని వారికి అందజేసి, శ్రీ స్వామివారి చిత్రపటం, శేష వస్త్రం,ప్రసాదాలను దేవస్థాన సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ అందజేశారు.

# ఆలపాటి గెలుపు కు కూటమి నేతల ప్రచారం



**అవనిగడ్డ,ఫిబ్రవరి 18 (వార్తాప్రభ) :** కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల వేడి ఉపందుకున్నట్లు గా అభ్యర్థుల తరుపున ప్రచారాలు ఉపందుకుం టున్నాయి.మొవ్వ మండల పరిధిలో ని కూచిపూడి, పెదపూడి తదితర గ్రామాలలో కూటమి నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల కరపత్రాలతో గ్రామ గ్రామానా ఎలక్షన్ క్యాంపెయిన్ నిర్వహిస్తూ కరపత్రాలను పంపి ణీ చేశారు. కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ కు మొదటి ప్రాదాన్యతా ఓటు తో భారీ మెజారిటీతో గెలిపించవలసిందిగా ఓట్లు అభ్యర్థిస్తూ ప్రచారం నిర్వహిం చారు. పట్ట భద్రలైన యువతకు భరోసా ఇచ్చి విస్తృత ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తున్నట్లు ప్రచారం నిర్వహిస్తున్నారు వీరి ప్రచారానికి పట్ట భద్రుల నుండి మంచి స్పందన వ్యక్తం కావడం తో తమ అభ్యర్థి గెలుపు తథ్య మనే ధీమా ను కూటమి నేతలు వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమములో తెలుగు దేశం పార్టీ మొవ్వ మండలం క్లస్టర్ తులసీదాసు , న్యాయ వాది పోతు ల వెంకట శివ శ్రీనివాస్, పాండురంగారావు, దుర్గాప్రసాద్ వై రంగా రావు తదితరులు పాల్గొన్నారు.ఇదే విధంగా అవనిగడ్డ నియోజకవ ర్గంలో కూటమి నేతలు విస్తృత ప్రచారం చేస్తూ ఓట్లు అభ్యర్థించారు.


**గ్రామ పంచాయితీ కార్యాలయం - కోడూరు**
**జి.కొండూరు మండలం**
**టెండరు ప్రకటన**

**తేది. 19.02.2025.**

కృష్ణాజిల్లా, జి.కొండూరు మండలం, కోడూరు గ్రామ పంచాయితీ చెందిన 2025-26 సంవత్సరము కాంట్రాక్టు లేబరు పద్ధతిపై రోజు వారి వేతనమునకు పనిచేయుటకు ఈ దిగువ షెడ్యూలు దాఖలు టెండర్లు ది.04-03-2025 మధ్యాహ్నం గం.3.00ల వరకు సీల్డు టెండర్లు స్వీకరించబడును. ఆసక్తి గలవారు నిర్ణీత ధరావత్తు చెల్లించి టెండర్లలో పాల్గొనవచ్చును. ఆఫీసు పనిచేయు వేళ యందు ఒక రోజు మాత్రం టెండరు షెడ్యూలు రూ.100/- చెల్లించి పొందవచ్చును. ఇతర వివరములు కార్యాలయము పనిచేయు వేళలయందు తీసుకొనవచ్చును.

| వ.నెం | పని పేరు | సంఖ్య | కాల పరిమితి | ఒక్కొంటికి ధరావత్తు రూ. |
|---|---|---|---|---|
| 1) | స్వీపర్ | 1 | ది.01-04-2025 నుండి ది.31-03-2026 | 500 |
| 2) | మంచినీటి సరఫరా పనులు | 3 | ---- | 500 |
| 3) | వీధి దీపాలు రిపేర్లు | 1 | ---- | 500 |

నోట్ :-

1. గతంలో గ్రామ పంచాయితీలో పని చేసిన వారికి ప్రాధాన్యత కల్పించబడును.
2. పంచాయితీ నిధులు లభ్యత బట్టి వేతనం చెల్లించబడును.
3. వీది దీపములు రిపేర్లు పనులు యందు అనుభవము కలిగిఉండవలెను
4. ఎటువంటి పరిస్థితిలో అయిన టెండర్లు వాయిదా వేసే అధికారము కార్యదర్శికి కలదు.

**సం/- వంగూరి ప్రసాద్**
**సర్పంచ్, కోడూరు**

**సం/- సిహెచ్.శ్రీనివాసరావు**
**పంచాయతీ కార్యదర్శి, కోడూరు**


# ఎన్ఆర్ఐ గిరిబాబు మర్యాదపూర్వక కలయిక



**విస్సన్నపేట,ఫిబ్రవరి 18 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని కలగర లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ వల్లభనేని గిరిబాబు ఎన్టీఆర్ డిస్టిక్ డిసిపి కెఎం మహేశ్వర రాజును మర్యాదపూర్వకంగా కలిసి ఇండోర్ ప్లాంట్ అందజేశారు. నిరంతరం ఎండనకా వాననక రేయి అనక పగలనకా చలి అనక నిరంతరం ఎనీ టైం ఎనీ ప్లేస్ డ్యూటీలో ఉండేది ఒక్క పోలీసు శాఖ అని కుటుంబాలకు దూరంగా మీరు అందిస్తున్న సేవలు వలన మేము ప్రశాంతంగా నిద్రపోతున్నామని కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆయన సెల్యూట్ చేశారు.

# రైతులకు విశిష్ట సంఖ్య తప్పనిసరి : ఇంచార్జ్ ఏవో నూరున్నీసా



**పెడన,ఫిబ్రవరి 18 (వార్తాప్రభ) :** ఫార్మర్ రిజిస్ట్రీ పేరుతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వాలని నిర్ణయించింది. విశిష్ట సంఖ్యకు అర్హులైన రైతులను గుర్తించి ప్రభుత్వ సబ్సిడీలు పంటల బీమా వంటి ప్రయోజనాలు పొందేందుకు భూ ఆధార్ అవసరమని పేర్కొంది. ప్రభుత్వ సూచనలతో పెడన పట్టణ రూరల్ ప్రాంతాలలో ఈ ప్రక్రియ మొదలు పెట్టారని పెడన ఇంచార్జ్ వ్యవసాయ అధికారి నూరున్నీసా తెలిపారు. దీంతో వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి రైతులకు అవగాహన కల్పిస్తున్నామని ఆమె అన్నారు. రైతు సేవా కేంద్రాల్లో రైతులకు సంబంధించిన విశిష్ట సంఖ్య అవగాహన కార్యక్రమంలో భాగంగా రైతులతో ఆమె మాట్లాడారు. రైతు సేవ కేంద్రాల్లో రైతులు తమ పేరును నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ రైతులందరికీ తొలుత 14 అంకెలతో ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్య ఇవ్వనున్నామని, తరువాత భూ ఆధార్ పేరుతో కార్డులను జారీ చేయనున్నామని ఆమె తెలిపారు. విశిష్ట సంఖ్య పొందేందుకు ప్రతి రైతు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకాలను తీసుకుని రైతు సేవా కేంద్రాలకు వెళ్లాలని ఆమె సూచించారు. ఇందుకోసం రూపొందించిన పోర్టల్ లో రైతుల వివరాలను నమోదు చేసి రైతు ఫోన్ నెంబర్ కు వచ్చిన ఓటీపీ సిబ్బందికి చెప్తే వారు 14 అంకెల విశిష్ట సంఖ్యను చెప్తారని ఆమె తెలిపారు. ఈ విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవడం వలన ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు ఇతర ప్రయోజనాలు పొందేందుకు అవకాశం ఉంటుందని ఆమె రైతులకు తెలియజేశారు. విశిష్ట సంఖ్య సహాయంతో అర్హులైన రైతుల గుర్తింపు వారికి వర్తించనున్న సబ్సిడీలు పంటలు భీమా వంటి ప్రయోజనాలు పొందేలా చేస్తుందన్నారు.పీఎం కిసాన్ చెల్లింపులు అన్నదాత సుఖీభవ పంట రుణాలు పంటల భీమా రాయితీపై సూక్ష్మ పథకాలు సూక్ష్మ సేద్యం పై రాయితీ వంటి పథకాలను నేరుగా పొందేందుకు అవకాశం ఉందని వివరించారు.వీటితోపాటు నీటిపారుదల తెగుళ్ళ నియంత్రణ వాతావరణ సూచనలు వంటి ఇతర సేవలు అందుకోవడానికి దోహదపడుతుందని ఆమె రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు,రైతులుపాల్గొన్నారు.

# కూటమి అభ్యర్థి ఆలపాటిని భారీ మెజారిటీతో గెలిపిద్దాం

● ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**నందిగామ,ఫిబ్రవరి 18 (వార్తాప్రభ) :** మంగళవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా - పట్టణంలోని పలు అధికారులను, ఉపాధ్యాయులను మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి మరియు కూటమినేతలతో కలిసి ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఓటును అభ్యర్థించారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ ఈనెల 27వ తారీఖున ఎంతో ప్రతిష్టాత్మకంగా జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో మొదటి ప్రాధాన్యత ఓటు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ కు వేసి మెజారిటీతో గెలిపించగలరని ఓటును అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నందిగామ మండల పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కౌన్సిలర్లు తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అన్న దానం కు 10 వేలు విరాళం...



**పెనుగంచిప్రోలు,ఫిబ్రవరి 18 (వార్తాప్రభ) :** శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం లో జరుగు అన్న ధానం కు తమనం భాస్కరరావు ధర్మపత్ని విజయలక్ష్మి నరసరావుపేట పల్నాడు జిల్లా వాస్తవ్యులుఅన్న ధానం కు రూ. 10,000 (పది వేల రూపాయలు) విరాళంగా మంగళవారం ఆలయ అధికారులకు అందజేయడం జరిగింది. వారికి దేవస్థానం తరుపున దర్శనం కల్పించి ఆశీర్వచనం చేసి శేష వస్త్రాలు తీర్థప్రసాదాలు అందించడం జరిగినది...

# నన్నయ వర్సిటీ నూతన వీసీ గా ఆచార్య ఎస్. ప్రసన్న శ్రీ




**రాజమహేంద్రవరం,ఫిబ్రవరి 18 (వార్తాప్రభ) :** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ నూతన వైస్ ఛాన్సలర్ గా ప్రొఫెసర్ సత్తుపాటి ప్రసన్నశ్రీ ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రసన్నశ్రీ ప్రస్తుతం ఆంధ్ర యూనివర్సిటీ డిపార్ట్మెంట్ ఆఫ్ ఇంగ్లీష్ ప్రొఫెసర్ గా విధులు నిర్వహిస్తున్నారు. అంతరించిపోతున్న గిరిజన భాషలను కాపాడుకునేందుకు విశేష కృషి చేసి భగత, గదభ, కొలామి, కొండ దొర వంటి 19 గిరిజన భాషలకు లిపి రూపొందించిన తొలి మహిళామూర్తిగా ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ నిలిచారు. 2022 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ చేతుల మీదుగా నారీశక్తి పురస్కారాన్ని అందుకున్నారు. 38 సంవత్సరాల బోధనా అనుభవంలో ఎన్నో భాషా, సాహిత్య సంస్కరణలకు కృషి చేశారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 10 సెమినార్లు నిర్వహించి, 60 సెమినార్లుకు హాజరయ్యారు. 125 పరిశోధన వ్యాసాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రచురించబడ్డాయి. ప్రసన్నశ్రీ చేసిన సేవలకు నిదర్శనంగా బెస్ట్ టీచర్ అవార్డ్స్, బెస్ట్ ఉమెన్ స్పీకర్ అవార్డు, గిరిజన అరక బ్రహ్మ, దళిత సాహిత్య అకాడమి అవార్డు, ఉమెన్ అచీవర్స్ అవార్డు, నారీశక్తి అవార్డు, ఇండియన్ ఇండిగేనోస్ స్క్రిప్టేర్ అవార్డు వంటి జాతీయ, అంతర్జాతీయ అవార్డులు ఆమెకు లభించాయి. విద్యావేత్తగా, సాహిత్యవేత్తగా, పరిశోధకురాలిగా, సెమినార్స్, వర్క్ షాప్స్, ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తూ నిత్య భాషా, సాహిత్య అభివృద్ధికి కృషి చేస్తున్న ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ ని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వీసీ గా నియమించడం హర్షనీయం.

# మొక్క జొన్నకు ఇటుక బట్టీల దెబ్బ..!

● ఫ్లయాష్ ,దుమ్ము ధూళితో నిండిపోతున్న మొక్కజొన్న పంటలు ● లబోదిబోమంటున్న మొక్కజొన్న రైతులు

● ఇటుక బట్టీల నుంచి పంటలను కాపాడాలంటూ అధికారులకు మొరపెట్టుకుంటున్న రైతులు





ఇటుకబట్టీల నుంచి వస్తున్న దట్టమైనపొగ

**మైలవరం,ఫిబ్రవరి 18 (వార్తాప్రభ) :** ఇటుక బట్టీల నుంచి వచ్చే ఫ్లయాష్, దుమ్ము ధూళి, పొగ వల్ల మొక్కజొన్న పంటలు దెబ్బతింటున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయానికి దిగుబడి తగ్గిపోయి ఆర్థికంగా నష్టపోతు న్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మండల కేంద్రమైన మైలవరం గ్రామ శివారు చిన్న గూడెం గ్రామానికి కూత వేటు దూరంలో కుంటముక్కల వెళ్లే రహదారికి రెండు వైపులా ఇటుక బట్టీలు ఉన్నాయి. అయితే ఈ బట్టీలు పక్కనే కొంతమంది రైతులు మొక్కజొన్న పంట సాగు చేస్తున్నారు.ఈ రహదారిలో నిత్యం ఫ్లయాష్ లారీలు (బూడిద లారీలు) తిరుగుతూ బట్టీలలో ఫ్లయాస్ ను డంపు చేస్తున్నాయని, డంపు చేసిన బూడిద గాలికి లేచి పంట పొలాలను ముంచె త్తుతుందని రైతులు వాపోయారు. మ-రోవైపు బట్టీలలో లారీలు తిరిగేటప్పుడు బట్టీలలో ఉన్న దుమ్ము ధూళి ఒక్కసారిగా గాలిలో కలిసి పంట పొలాలపై పడుతుం దన్నారు.దుమ్ము ధూళితో నిండిపోయిన పంట పొలాల్లో దిగుబడి సగానికి సగం తగ్గిపోతుందని రైతులు అంటున్నారు.ఇటుక బట్టీల వల్ల తమ పంటలు పాడవుతున్నాయని స్థానిక తహశీల్దార్ కు విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

**కౌలు రైతుల పరిస్థితి దయనీయం:** వ్యవసాయాన్ని నమ్ముకున్న కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఎకరానికి 20000 వేల రూపాయలు చెల్లించి మొక్కజొన్న పంటను పండిస్తున్న రైతులు ఎక్కువగా నష్టపోతున్నారు. విత్తనం నాటిన నుంచి పంట చేతికొచ్చేవరకు మధ్యలో పెట్టుబడి రూ.20 నుంచి రూ.25 వేలు వరకు అవుతుందని రైతులు చెబుతున్నారు.ఎప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి ఇటుక బట్టీల నుంచి తమ పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

### చిన్నగూడెం పక్కన ఇటుక బట్టీలతో ఇబ్బంది పడుతున్నాం

-కోట జగన్మోహన్ రావు, రైతు



మైలవరం గ్రామపంచాయతీ శివారు చిన్న గూడెం పక్కన ఉన్న ఇటుక బట్టీలతో ఇబ్బంది పడుతున్నాం. బట్టీల నుంచి వచ్చే పొగ,బూడిద,దుమ్ము ధూళితో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి.మరీ రోడ్డుకు ఆనుకొని బట్టీలు పెట్టడం వల్ల పొలంలోకి వెళ్లేటప్పుడు పొగ,బూడిద కళ్ళల్లో పడి కళ్ళు మండుతున్నాయి. నేను కవులు రైతుని.4 ఎకరాలలో మొక్కజొన్న పంట వేశాను.ఇటుక బట్టీల నుంచి వచ్చే బూడిద, దుమ్ము ధూళి వల్ల మొక్కజొన్న పంట దెబ్బతింటోంది. మా పరిస్థితి ఏమిటో మాకే అర్థం కావడం లేదు.

### అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదు:

-మాదు పుల్లయ్య, రైతు-మైలవరం



ఇటుక బట్టీల వల్ల మా పంటలు దెబ్బతింటున్నాయని తహశీల్దార్ దృష్టికి తీసుకు వెళ్లిన పట్టించుకోవడం లేదు.నేను 2 ఎకరాలలో మొక్కజొన్న పంట వేశాను. మొక్కజొన్న చేను మొత్తం దుమ్ము ధూళితో నిండిపో యింది.ఎకరానికి 40 క్వింటాల పంట దిగుబడి రావాలి. పరిస్థితి చూస్తే 25 క్వింటాలు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. మా గోడు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు.పంటలపై ఇటుక బట్టీలలో నుంచి దుమ్ము ధూళి పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188